తరంగాలు
రిపోర్టర్లు కావలెను
అతి తక్కువ కాలంలో తెలుగు రాష్ట్రాల్లో అత్యంత ప్రజాదరణ పొందుతున్న 'తరంగాలు' జాతీయ దినపత్రిక నందు పనిచేయుటకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లోని అన్ని జిల్లాలోని అన్ని మండలాల నుండి రిపోర్టర్లు కావలెను.
సంప్రదించండి...
ఎడిటర్: గడ్డం నాగరాజు గౌడ్
94949 23460

https://epaper.tharangalu.in
RNI. TELTEL / 2022 / 83463
జాతీయ దిన ప్రతిక
# తరంగాలు
Tharangalu Daily News Paper
ప్రతి అక్షరం.... సామాన్యుడి అస్త్రం...

హైదరాబాద్
సోమవారం
27 జులై 2026
సంపుటి 03
సంచిక 286
పేజీలు 8
వెల రూ.5.00

Published From : Hyderabad,Circulated:Telangana,Andhrapradesh
Epaper: www.tharangalu.in.com



## బంగాళాఖాతంలో వాయుగుండం

- ఉత్తరకోస్తాకు వర్షసూచన
- వేటకు వెళ్లొద్దని హెచ్చరిక

విశాఖపట్నం, అమరావతి, జూలై 26 తరంగాలు న్యూస్ పశ్చిమ బెంగాల్, ఉత్తర ఒడిశాను ఆనుకొని వాయవ్య బంగాళాఖాతంలో ఉన్న అల్పపీడనం ఆదివారం తీవ్ర అల్పపీడనంగా.. అనంతరం వాయుగుండంగా బలపడింది. ఈ క్రమంలో వాయవ్యంగా పయనించి ఆదివారం మధ్యాహ్ననికి ఒడిశాలోని బాలాసోర్‌కు తూర్పు ఆగ్నేయంగా 150 కి.మీ.ల దూరంలో కేంద్రీకృతమై ఉంది. సోమవారం ఉదయానికి తీవ్ర వాయుగుండంగా బలపడి బాలాసోర్‌కు ఉత్తరాన తీరం దాటనున్నదని వాతావరణ

మిగతా 2వ పేజిలో..

## పరీక్షా విధానంలో సంస్కరణలకు..
# హైపవర్డ్ టాస్క్‌ఫోర్స్

- నందన్ నిలేకణి నేతృత్వంలో ఏర్పాటు.. ప్రధాని నరేంద్ర మోదీ ప్రకటన
- టాస్క్‌ఫోర్స్‌లో ఇస్రో మాజీ చీఫ్ సోమనాథ్ సహా ఐదుగురు సభ్యులు
- దెబ్బతిన్న మోదీ ఇమేజ్‌ను బాగు చేసుకునే హైపవర్డ్ యత్నమిది: కాంగ్రెస్



న్యూఢిల్లీ, జూలై 26తరంగాలు న్యూస్ : పదేపదే ప్రశ్నపత్రాలు లీక్ అవుతుం డడంపై విద్యార్థి లోకం గళమెత్తుతు ఒడడంతో.. పరీక్షా విధానంలో సంస్కరణల దిశగా కేంద్రం కీలక ముందడుగు వేసింది. ఇన్ఫోసిస్ సహవ్యవస్థాపకుడు, ఆధార్ రూపకర్త నందన్ నిలేకణి నేతృత్వంలో ఈ అంశంపై హైపవర్డ్ టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేసింది. ప్రధాని నరేంద్ర మోదీ ఆదివారం ఇన్‌స్టాగ్రామ్ వీడియో ద్వారా ఈ విషయాన్ని వెల్లడించారు. దేశ పరీక్షా వ్యవస్థను మరింత పారదర్శకంగా, విశ్వసనీయంగా, టెక్నాలజీ ఆధారిత వ్యవస్థగా మార్చడానికి తీసుకోవాల్సిన చర్యలను ఈ టాస్క్‌ఫోర్స్ సిఫారసు చేస్తుందని పేర్కొన్నారు. నీట్ పేపర్ లీక్ అనంతరం విద్యార్థుల ప్రయోజనాలను కాపాడేందుకు ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుందని గుర్తుచేసిన ప్రధాని.. సంస్కరణల ద్వారా పరీక్షా వ్యవస్థను మరింత బలోపేతం చేయడంపై దృష్టి సారిస్తామని చెప్పారు. "విద్యార్థుల సంక్షేమం కోసం భారత ప్రభుత్వం ఇప్పటికే పలు చర్యలు తీసుకుంది. స్టూడెంట్స్ భవిష్యత్తుతో ఆడుకున్నవారు ఇప్పటికే జైళ్లలో మగ్గుతున్నారు. ఇప్పటికే మేం ఫాస్ట్‌ట్రాక్ కోర్టులను ఏర్పాటు చేశాం. సోమవారం పార్లమెంటులో.. అత్యంత కఠినమైన నిబంధనలతో కొత్త చట్టం తెచ్చేందుకు సిద్ధమవుతున్నాం" అని మోదీ తాజా వీడియో సందేశంలో వివరించారు. ప్రభుత్వం తక్షణ చర్యల గురించి మాత్రమే కాకుండా.. దీర్ఘకాలంలో చేపట్టాల్సిన సంస్థాగత సంస్కరణల దిశగా కృషి చేస్తోందని చెప్పారు. "మనం భవిష్యత్తు గురించి కూడా ఆలోచించాలి. మన పరీక్షా వ్యవస్థ విశ్వసనీయంగా, పారదర్శకంగా ఉండాలి. టెక్నాలజీని గరిష్ఠంగా వినియోగించుకోవాలి. వీటన్నింటినీ దృష్టిలో పెట్టుకుని.. అంతర్జాతీయంగా పేరొందిన సాంకేతిక నిపుణుడు నందన్ నిలేకనీ నేతృత్వంలో పరీక్షావిధానంలో సంస్కరణల నిమిత్తం ఒక హై-పవర్డ్ టాస్క్‌ఫోర్స్‌ను

మిగతా 2వ పేజిలో..

# మహిళా రిజర్వేషన్, డీలిమిటేషన్‌తో కలిపే.. యువతరం బిల్లు



- చట్టసభలకు పోటీ వయసు 21 ఏళ్లకు తగ్గించే అంశాన్నీ చేర్చండి
- ప్రధాని మోదీకి సీఎం రేవంత్‌రెడ్డి ప్రతిపాదన
- 21 ఏళ్ల యువత ఐఏఎస్, ఐపీఎస్ అవుతున్నారు, పెద్ద కంపెనీలనూ నడుపుతున్నారు..
- దేశ భవితనూ నిర్ణయించాలనుకుంటున్నారు
- చట్టసభలకు పోటీ వయసును 21 ఏళ్లకు
- తగ్గించే అంశంపై అసెంబ్లీలో తీర్మానం చేస్తాం
- కేవలం నినాదాలతో దేశం అభివృద్ధి చెందదు
- ప్రతిపక్షాలు, ప్రజల మాటను వినాలి
- అలా చేయకనే 56 అంగుళాల ఛాతీ
- యువత ముందు తలవంచాల్సి వచ్చింది
- జాతీయ మీడియాతో ఇష్టాగోష్ఠిలో సీఎం రేవంత్

హైదరాబాద్, జూలై 26 తరంగాలు న్యూస్ దేశంలో అసెంబ్లీలు, లోక్‌సభకు పోటీచేసే కనీస వయసును 21 ఏళ్లకు తగ్గించాలని.. ప్రస్తుత మహిళా రిజర్వేషన్, డీలిమిటేషన్ బిల్లులోనే ఈ అంశాన్నీ చేర్చాలని ప్రధాని మోదీకి సీఎం రేవంత్‌రెడ్డి ప్రతిపాదించారు. ఇప్పుడు 21 ఏళ్ల యువత ఐఏఎస్, ఐపీఎ?సలు అవుతున్నారని, పెద్ద కంపెనీలనూ నడుపుతున్నారని గుర్తు చేశారు. వారికి రాజకీయాల్లో ఎందుకు అవకాశం ఇవ్వకూడదని ప్రశ్నించారు. ఈ అంశంపై రాష్ట్ర శాసనసభలో తీర్మానం చేసి కేంద్రానికి పంపుతామని తెలిపారు. మహిళా రిజర్వేషన్, నియోజకవర్గాల పెంపు, పునర్విభజన, పోటీ వయసు 21 ఏళ్లకు తగ్గించడం.. ఈ నాలుగు అంశాలనూ ఒకే బిల్లులో చేర్చి పార్లమెంటులో సమగ్ర చర్చ చేపట్టాలని ప్రధాని మోదీని కోరారు. లేదా సంయుక్త పార్లమెంటరీ కమిటీ ఏర్పాటు చేసి, ఈ అంశాలపై అన్ని పార్టీల అభిప్రాయాలు తీసుకోవాలని.. నిపుణులు, సంబంధిత వర్గాలతోనూ చర్చించాలని డిమాండ్ చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి ఆదివారం హైదరాబాద్‌లోని తన నివాసంలో జాతీయ మీడియాతో మాట్లాడారు. దేశంలోని యువశక్తి ముందు 56 అంగుళాల ఛాతీ కూడా తలవంచాల్సి వచ్చిందని రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. ఐదేళ్ల క్రితం రైతులకు వ్యతిరేకంగా తీసుకొచ్చిన మూడు నల్లచట్టాలను ప్రతిపక్షాలు తప్పుబట్టినా మోదీ వినలేదని.. ఆ చట్టాలను వెనక్కి తీసుకోవడమే కాకుండా రైతులకు క్షమాపణలు కూడా చెప్పాల్సి వస్తుందని ఏఐసీసీ అగ్రనేత రాహుల్ చెప్పారని గుర్తు చేశారు. తర్వాత రైతుల పోరాటంతో మోదీ సర్కారు సాగు చట్టాలను వెనక్కి తీసుకుని, రైతులకు క్షమాపణ చెప్పాల్సి వచ్చిందన్నారు. ఆ తర్వాతైనా ప్రతిపక్షాలకు మోదీ కొంత గౌరవం

మిగతా 2వ పేజిలో..



# ఇందిరమ్మ ఇళ్లకు టెండర్లు

- 7,340 ఎల్ఐజీ ఫ్లాట్ల నిర్మాణానికి ఆహ్వానం
- 10 ప్యాకేజీలు.. 16 టవర్లు.. 10 అంతస్తులతో నిర్మాణం
- అధికంగా ప్యాకేజీ-2లో 129 కోట్లతో 1440 ఫ్లాట్లకు..
- 29 నుంచి.. ఆగస్టు 19 వరకు టెండర్ల స్వీకరణ
- ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో తొలిసారి ఈపీసీ విధానం

హైదరాబాద్, జూలై 26 తరంగాలు న్యూస్ పట్టణ గృహనిర్మాణ పథకం కింద కోర్ అర్బన్ రీజియన్ (క్యూర్) పరిధిలో ఇందిరమ్మ టవర్ల నిర్మాణానికి సంబంధించి ప్రభుత్వం వడివడిగా అడుగులు వేస్తోంది. ఇళ్ల (ఫ్లాట్ల) కేటాయింపు తరువాతే నిర్మాణాలు చేపట్టాలని ఇప్పటికే నిర్ణయించిన విషయం తెలిసిందే. అయితే దరఖాస్తుల ప్రక్రియ పూర్తయ్యేలోపు టవర్ల నిర్మాణానికి సంబంధించిన టెండర్ల వ్యవహారాన్ని కూడా పూర్తిచేసేందుకు హౌసింగ్ బోర్డు చర్యలు చేపట్టింది. హైదరాబాద్ మహానగరం పరిధిలోని 24

మిగతా 2వ పేజిలో..



# క్షిపణుల కొరత ఆగిన దాడులు

- సౌదీ ఆరామ్‌కో రిఫైనరీపై హుతీల దాడి
- అమెరికా వద్ద తరిగిపోతున్న క్షిపణుల నిల్వలు
- ప్రభుత్వ సలహాదారుల హెచ్చరికలతో తగ్గిన ట్రంప్
- ఆదివారం నిలిచిపోయిన అమెరికా, ఇరాన్ దాడులు
- హోర్ముజ్‌లో సీమైన్ తగిలి పేలిపోయిన ట్యాంకర్!

వాషింగ్టన్/దుబాయ్, జూలై 26తరంగాలు న్యూస్ : ఇరాన్‌పై దాడులు మరింత పెంచుతామని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఇటీవల ప్రకటించారు. ఊహించనంత భారీగా దాడులు ఉంటాయనీ చెప్పారు. కానీ అందుకు విరుద్ధంగా ఇరాన్‌పై దాడుల తీవ్రత తగ్గుతూ వచ్చింది. ఆదివారం అసలు ఎలాంటి దాడులూ చేయలేదు. అమెరికాకు క్షిపణుల కొరత తలెత్తుతుండటం, దౌత్య చర్యల్లో పురోగతి, యుద్ధం మరింత విస్తరించే ప్రమాదం ఉందని రక్షణశాఖ ఉన్నతాధికారులు, సలహాదారులు హెచ్చరించడమే దీనికి కారణమని అమెరికా మీడియా వెల్లడించింది. అమెరికా ఎంతగా దాడులు చేస్తున్నా

మిగతా 2వ పేజిలో..

# శుభకార్యానికి వెళ్లి వస్తూ...

- ప్రమాదంలో నుజ్జునుజ్జు అయిన కారు సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న పోలీసులు
- ఇద్దరి మృతి.. మరో నలుగురికి గాయాలు
- శ్రీకాకుళం మండలం చాపురం హైవే వద్ద ఘటన



శ్రీకాకుళం క్రైం/ పోలాకి/ నరసన్నపేట, జూలై 26తరంగాలు న్యూస్ ఓ శుభకార్యానికి వెళ్లి.. ఆనందంగా తిరిగి వస్తూ.. మరికొన్ని గంటల్లో ఇంటికి చేరుకుంటామనుకున్న ఆ కుటుంబంలో విషాదం రేగింది. అకస్మాత్తుగా సంభవించిన ప్రమాదంలో ఇద్దరు మృతి చెందగా.. మరో నలుగురు గాయపడ్డారు. ఈ విషాద ఘటన శ్రీకాకుళం మండలం చాపురంలో ఆదివారం సాయంత్రం చోటుచేసుకుంది. పోలీసులు, బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. విశాఖపట్నం రూరల్ ప్రాంతానికి చెందిన బంకుపల్లి సత్య గోపాల్ శాస్త్రి(75),

మిగతా 2వ పేజిలో..

# టైలర్ కుమారుడికి 1.06 కోట్ల ప్యాకేజీ

- **కెనడా కంపెనీలో ఏఐ ఇంజనీర్‌గా ఉద్యోగం**
- **కాకినాడ జిల్లా కొత్తపల్లి యువకుడి ఘనత**

కొత్తపల్లి, జూలై 26 తండ్రి టైలర్.. తల్లి కుట్టు పనిలో భర్తకు సాయంగా ఉంటుంది. ఇలాంటి పేద కుటుంబం నుంచి వచ్చిన విద్యార్థి రూ.1.06 కోట్ల వార్షిక వేతనంతో కెనడా కంపెనీలో ఏఐ ఇంజనీర్‌గా

ఉద్యోగం సాధించాడు. కాకినాడ జిల్లా పిఠాపురం నియోజకవర్గం కొత్తపల్లి మండలం కుతుకుడుమిల్లి గ్రామానికి చెందిన మాల్తి అఖిలేశ్... ఇటీవల నిర్వహిం చిన క్యాంపస్ ఇంటర్వ్యూలో సెలెక్ట్ అయి ఆఫర్ లెటర్ అందుకున్నారు. ఇటీవలే విధుల్లో చేరిన అఖిలేశ్... ఇది పూర్తిగా వర్క్‌ఫ్రం హోం ఉద్యోగమని 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు. మాల్తి అఖిలేశ్ తండ్రి గంగాధరరావు చెవిటి, మూగ. ఆయన టైలరింగ్ చేస్తూ వచ్చే కొద్దిపాటి ఆదాయంతో కుటుంబాన్ని పోషించుకుంటూ ఇద్దరు పిల్లల్ని చదివించారు. అఖిలేశ్ తల్లి భర్త కుట్టిన వస్త్రాలకు చేతిపనులు చేస్తూ ఆసరాగా ఉంటోంది. కొత్తపల్లి వీవీఎ?సలో పదో తరగతి వరకు చదివిన అఖిలేశ్.. నారాయణ జూనియర్ కళాశాలలో ఇంటర్ (ఎంపీసీ), సూరంపాలెం ఆదిత్య యూనివర్సిటీలో డేటాసైన్స్‌లో ఇంజనీరింగ్ పూర్తిచేశాడు.

## శుభకార్యానికి వెళ్లి వస్తూ...

పోలాకి మండలం గొల్లలవలస ప్రాంతానికి చెందిన గోపాలశాస్త్రి బంధువులు.. మొత్తం ఆరుగురు ఆదివారం ఉదయం కారు(ఎర్టిగా)లో విజయనగరం జిల్లా రాజాంలోని బంధువుల ఇంట్లో బాలసారె కార్యక్రమానికి వెళ్లారు. గొల్లలవలసలో కారును అద్దెకు తీసుకుని వీరు వెళ్లారు. రాజాంలో కార్యక్రమం ముగించుకుని సాయంత్రం తిరిగి వస్తుండగా శ్రీకాకుళం మండలం చాపురం హైవే వద్ద చెన్నై నుంచి కోల్‌కత్తాకు వెళ్తున్న కంటైనర్‌లారీ ఎడమభాగాన ఉన్న హుక్కుకు ఢీకొన్నారు. దీంతో కారును సుమారు యాభై మీటర్లమేర లారీ ఈడ్చుకుపోయింది. కారులో ముందుసీటులో కూర్చున్న బంకుపల్లి సత్య గోపాల్ శాస్త్రి తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతిచెందారు. డ్రైవర్ పొట్టా వినయ్‌కుమార్‌కు తీవ్రగాయాలయ్యాయి. మిగిలిన నలుగురికీ గాయలయ్యాయి. విషయం తెలుసుకున్న పోలీసులు.. స్థానికులు.. హుటాహుటిన క్షతగాత్రులను అంబులెన్స్‌లో ప్రభుత్వ సర్వజన ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్సపొందుతూ పరిస్థితి విషమించి డ్రైవర్ వినయ్‌కుమార్ మరణించాడు. అలాగే క్షతగాత్రుల్లో మరో ఇద్దరు దార్లపూడి వెంకట సూర్యనారాయణ, రోజా దంపతులను మెరుగైన చికిత్స కోసంశ్రీకాకుళంలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. సంఘటనా ప్రాంతాన్ని రూరల్ స్టేషన్ ఎస్ఐ కరణం వెంకట సురేష్ పరిశీలించారు. కేసు నమోదు చేసి మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం సర్వజన ఆసుపత్రి మార్చురీకి తరలించారు.

## ఆగిన బతుకు బండి

చిన్నతనంలోనే ఆ యువకుడు కుటుంబ బాధ్యతలను మోయాల్సి వచ్చింది. కారు డ్రైవర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటూ...తండ్రికి చేదోడువాదోడుగా ఉండేవాడు. ప్రమాదం రూపంలో యువకుడిని మృత్యువు బలిగొనడంతో కుటుంబం దీనంగా విలపిస్తోంది. చాపురం వద్ద ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో నరసన్నపేటలోని దేశవానిపేటకు చెందిన వినయ్(26) మృతి చెందడంతో కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరయ్యారు. వీరు నిరుపేదలు. వినయ్ తండ్రి సింహాచలం స్థానిక హెచ్‌పీ గ్యాస్ ఏజెన్సీలో పనిచేస్తుండగా... తల్లి భద్రమ్మ గృహిణి. వీరికి ఇద్దరు కుమారులు కాగా, వినయ్ పెద్దవాడు.

# క్షిపణుల కొరత ఆగిన దాడులు

ఇరాన్ ఏమాత్రం వెనక్కితగ్గడం లేదు.. పైగా చవకైన డ్రోన్లు, క్షిపణులతో గల్ఫ్‌లోని అమెరికా స్థావరాలపై విరుచుకుపడుతోంది. వాటిని అడ్డుకోవడానికి అమెరికా పేట్రియాట్, థాడ్ వంటి చాలా ఖరీదైన ఇంటర్‌సెప్టార్ క్షిపణులు వాడుతోంది. ఇది సుదీర్ఘంగా కొనసాగుతుండటంతో అమెరికా వద్ద క్షిపణుల నిల్వలు తగ్గిపోయాయి. దీనితో పశ్చిమాసియాలో అమెరికా స్థావరాలు, మిత్రదేశాల భద్రతపై ప్రభావం పడుతుందని సైన్యం ఆందోళన వ్యక్తం చేసినట్టు సమాచారం. మరోవైపు ఇరాన్ దెబ్బకు పశ్చిమాసియాలోని జోర్డాన్, బహ్రెయిన్ తదితర దేశాల్లో ఉన్న అమెరికా స్థావరాల్లో రక్షణ వ్యవస్థలు దెబ్బతిన్నాయి. దీనితో రక్షణ వ్యవస్థలను తప్పించుకుని మరీ ఇరాన్ క్షిపణులు అమెరికా స్థావరాల్లో విధ్వంసం సృష్టిస్తున్నాయి. యుద్ధాన్ని మరింత విస్తరించడంపై ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్, సెంట్రల్ కమాండ్ చీఫ్ డాన్ కెయిన్ ఆందోళన వ్యక్తం చేసినట్టు సమాచారం. ఈ క్రమంలోనే ఇరాన్‌పై దాడులకు కాస్త విరామం ఇవ్వాలని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ నిర్ణయించారని.. భారీస్థాయిలో దాడుల కోసం సైన్యం ప్రణాళిక సిద్ధం చేసినా.. ప్రస్తుతానికి పక్కనపెట్టాలని ఆదేశించారని రక్షణ వర్గాలు తెలిపాయి. దౌత్యపరమైన చర్చలకు మార్గం సుగమం చేయాలని పేర్కొన్నారని.. అయితే ఏక్షణమైనా విరుచుకుపడటానికి సిద్ధంగా ఉండాలని కూడా సూచించారని వెల్లడించాయి.

## సీమైన్‌ను ఢీకొని పేలిన చమురు ట్యాంకర్!

తాము సూచించిన మార్గంలో కాకుండా ఒమన్ తీరానికి సమీపంగా హోర్ముజ్ జలసంధి దాటడానికి ప్రయత్నించిన ఒక చమురు ట్యాంకర్ సముద్ర మందుపాతర (సీమైన్)ను ఢీకొని పేలిపోయిందని ఇరాన్ వార్తా సంస్థ టాస్నిమ్ పేర్కొంది. అది ఏ దేశ నౌక, ఎంత మేర దెబ్బతిన్నది, ప్రాణ నష్టమేదైనా జరిగిందా అన్న వివరాలేవీ వెల్లడించలేదు. దీనిపై ఇరాన్ రెవెల్యూషనరీ గార్డ్స్ (ఐఆర్‌జీసీ) నుంచి కూడా అధికారిక ప్రకటన ఏదీ రాలేదు.

## సౌదీ ఆరామ్‌కో రిఫైనరీపై హుతీల దాడి

సౌదీ అరేబియాలోని ఆరామ్‌కో రిఫైనరీలపై యెమెన్‌కు చెందిన ఇరాన్ మద్దతున్న హుతి తిరుగుబాటుదారులు డ్రోన్ దాడులు చేశారు. ఎర్ర సముద్రతీరంలోని జిజాన్, యాంబు ప్రాంతాల్లో ఉన్న ఆరామ్‌కో చమురు కేంద్రాలపై దాడి చేశామని హుతీల సైనిక ప్రతినిధి యహ్యా సరియా ప్రకటించారు. జిజాన్‌లోని రిఫైనరీపై దాడి జరిగిందని, అక్కడ భారీగా పొగలు వెలువడుతున్నాయని రాయిటర్స్ వార్తా సంస్థ పేర్కొంది. యాంబు రిఫైనరీ వైపు దూసుకొచ్చిన రెండు బాలిస్టిక్ క్షిపణులను పేట్రియాట్ వ్యవస్థతో విజయవంతంగా అడ్డుకున్నట్టుగా గ్రీకు భద్రతా దళాలు వెల్లడించాయని తెలిపింది.

# బంగాళాఖాతంలో వాయుగుండం

శాఖ తెలిపింది. (జూలై ఐదో తేదీన ఉత్తర ఒడిశాకు ఆనుకుని అల్పపీడనం బలపడి వాయుగుండంగా మారింది. మరల ఇరవై రోజుల తరువాత అదే ప్రాంతంలో అల్పపీడనం బలపడి వాయుగుండంగా మారింది) అనంతరం వాయవ్యంగా ఉత్తర ఒడిశా, పశ్చిమబెంగాల్ మధ్య నుంచి ఛత్తీస్‌గఢ్ దిశగా పయనించనున్నదని అంచనావేస్తున్నారు. దీని ప్రభావంతో ఒడిశా, పశ్చిమబెంగాల్, ఛత?సగఢ్ లో భారీ నుంచి అతిభారీ, ఒకటి రెండుచోట్ల కుంభవృష్టి వర్షాలు కురుస్తాయి. ఉత్తరకోస్తాలో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు, శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, విజయనగరం, పోలవరం, విశాఖ, అల్లూరి సీతారామరాజు జిల్లాల్లో ఒకటి, రెండుచోట్ల భారీ వర్షాలు కురుస్తాయని విశాఖ తుఫాన్ హెచ్చరిక కేంద్రం తెలిపింది. ఉత్తరాంధ్ర తీరంలో సముద్రం అల్లకల్లోలంగా ఉండడంతో ఈ నెల 29 వరకు మత్స్యకారులు సముద్రంలో చేపల వేటకు వెళ్లరాదని హెచ్చరించింది. విశాఖపట్నం, గంగవరం, కాకినాడ, మచిలీపట్నం, నిజాంపట్నం, కృష్ణపట్నం ఓడరేవుల్లో ఒకటో నంబరు భద్రతా సూచిక ఎగురవేశారు. కళింగపట్నం, భీమునిపట్నం ఓడరేవుల అధికారులకు సమాచారం అందించారు. కాగా, రాష్ట్రంలోని పలుప్రాంతాల్లో ఆదివారం ఉష్ణోగ్రతలు సాధారణం కంటే రెండు నుంచి నాలుగు డిగ్రీలు అధికంగా నమోదయ్యాయి. కావలి, జంగమహేశ్వరపురంలో 39.5 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది.

# పరీక్షా విధానంలో సంస్కరణలకు.. హైపవర్డ్ టాస్క్‌ఫోర్స్

ఏర్పాటు చేయాలని మేం నిర్ణయించాం" అని మోదీ పేర్కొన్నారు. భవిష్యత్తులో నిర్వహించే పరీక్షల విశ్వసనీయతను మరింత మెరుగుపరచేందుకు.. ఆ టాస్క్‌ఫోర్స్ చేసే సిఫారసులను వీలైనంత త్వరగా అమలుచేస్తామన్నారు. కాగా.. మోదీ ప్రకటించిన హైపవర్డ్ టాస్క్‌ఫోర్స్‌పై కాంగ్రెస్ పార్టీ స్పందించింది. ఇది పేపర్‌లీక్ విషయంలో దారుణంగా దెబ్బతిన్న ప్రధాని మోదీ ఇమేజ్‌ని బాగుచేసుకునేందుకు చేస్తున్న హై-పవర్డ్ ప్రయత్నం అని కాంగ్రెస్ సీనియర్ నేత జైరామ్ రమేశ్ ఎద్దేవా చేశారు. 2024 జూన్‌లో సైతం.. నీట్ సహా పలు పరీక్షల నిర్వహణలో విఫలమైన మోదీ సర్కారు డాక్టర్ కె.రాధాకృష్ణన్ నేతృత్వంలో ఒక హైలెవల్ కమిటీని ఏర్పాటు చేసిందని గుర్తుచేశారు. మళ్లీ 2026 జూలైలో కూడా నీట్ సహా పలు పరీక్షల నిర్వహణలో విఫలమై హైపవర్డ్ టాస్క్‌ఫోర్స్‌ను నియమించిందంటూ మోదీ సర్కారు వైఫల్యాలపై 'ఎక్స్' వేదికగా ధ్వజమెత్తారు. రాధాకృష్ణన్ కమిటీ చేసిన 101 సిఫారసులను మోదీ సర్కారు ఇంకా అమలు కూడా చేయకముందే కొత్త కమిటీ వచ్చిందని వ్యంగ్యంగా అన్నారు. 2024, 2026 నడుమ మోదీ సర్కారు ఎన్‌టీఏకు ఫుల్‌టైమ్ డైరెక్టర్ జనరల్‌ను కూడా నియమించలేకపోయిందని దుయ్యబట్టారు.

### యువతకు సాధికారతే మా లక్ష్యం

దేశంలో యువతీ యువకులంతా ఆత్మవిశ్వాసం, ఆత్మనిర్భరతతో సాధికారత సాధించేలా చేయడమే కేంద్ర ప్రభుత్వ లక్ష్యమని మోదీ అన్నారు. కేంద్ర ప్రభుత్వం 'మై భారత్' ద్వారా చేపట్టిన వికసిత్ వైబ్రెంట్ విలేజ్ కార్యక్రమానికి ఎంపికైన 400 మంది యువతతో ప్రధాన మోదీ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆదివారం మాట్లాడారు. నేటి యువతలో ఒంటరిగా (సోలో) ప్రయాణించడం ఓ ట్రెండ్‌గా మారుతోందని మోదీ అన్నారు. ఓ వ్యక్తి ప్రపంచంతోపాటు తనని తాను తెలుసుకునేందుకు సోలో ట్రావెలింగ్ ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. ఒంటరిగా ప్రయాణం మొదలుపెట్టిన మీరంతా ఓ కుటుంబం అయ్యారని వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న యువతను ఉద్దేశించి అన్నారు. కాగా, భారతదేశ సరిహద్దుల్లో ఉన్న గ్రామాలను దేశ తొలి గ్రామాలనే భావన తీసుకురావడం, అక్కడి ప్రజలను దేశ నిర్మాణంలో భాగస్వాములను చేయడమే లక్ష్యంగా వికసిత్ వైబ్రెంట్ విలేజ్ కార్యక్రమాన్ని రూపొందించారు. ఆన్‌లైన్‌లో ప్రత్యేకంగా నిర్వహించిన పోటీ ద్వారా దేశ నలమూలలుకు చెందిన 400 మంది యువతను ఈ కార్యక్రమానికి ఎంపిక చేశారు. వీరంతా జూన్ 4 నుంచి జూన్ 30 వరకు వికసిత్ వైబ్రెంట్ విలేజ్ కార్యక్రమంలో భాగంగా లద్దాఖ్, హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్‌లోని ఎంపిక చేసిన 74 గ్రామాల్లో వివిధ కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

### టాస్క్‌ఫోర్స్‌లో ఎవరున్నారంటే..

నందన్ నిలేకణి: ఇన్ఫోసిస్ సహవ్యవస్థాపకుడు, ఆ సంస్థ నాన్-ఎగ్జిక్యూటివ్ చైర్మన్, ఎస్.సోమనాథ్: ఇస్రో మాజీ చైర్మన్,తపన్ డేకా: ఇంటెలిజెన్స్ బ్యూరో మాజీ డైరెక్టర్,వి.కామకోటి: ఐఐటీ మద్రాస్ డైరెక్టర్,అనితా కర్వాల్: కేంద్ర విద్యాశాఖ మాజీ కార్యదర్శి, అమృత్‌లాల్ మీనా: లాజిస్టిక్స్ నిపుణుడు, 1989 బ్యాచ్ ఐఏఎస్ అధికారి (బిహార్ క్యాడర్).

# మహిళా రిజర్వేషన్, డీలిమిటేషన్‌తో కలిపే.. యువతరం బిల్లు

ఇస్తారని, పార్లమెంట్‌లో చర్చకు అవకాశం కల్పిస్తారని భావించామని.. కానీ వారి వైఖరి మారలేదని చెప్పారు. అనేక ప్రవేశ, నియామక పరీక్షల నిర్వహణలో కేంద్రం పూర్తిగా విఫలమైందని.. ప్రతిపక్షాల సూచనలు, హెచ్చరికలను పట్టించుకోలేదని మండిపడ్డారు. పైగా ఈడీ, ఐటీ, సీబీఐ వంటి కేంద్ర సంస్థలను ఉపయోగించి ప్రతిపక్షాలను బెదిరించడం, ఒత్తిడి తేవడం కొనసాగించిందని మండిపడ్డారు. ఇప్పుడు దేశ యువత గల్లీ నుంచి పార్లమెంటు వరకు బలాన్ని చూపడంతో 56 అంగుళాల ఛాతీ నిలబడలేక పోయిందని రేవంత్‌రెడ్డి చెప్పారు. ప్రతిపక్షాలు, మిత్రపక్షాల సూచనలు పట్టించుకోకుంటే యువత వీధుల్లోకి వచ్చేస్తుందని, ప్రభుత్వానికి ప్రజలు ఎదురుతిరుగుతారని మోదీ సర్కారుకు ఇప్పుడు అర్థమైందని పేర్కొన్నారు. కేవలం వికసిత్ భారత్, సబ్‌కా సాథ్- సబ్‌కా వికాస్ వంటి నినాదాలతోనే దేశ అభివృద్ధి జరగదని.. యువశక్తిని సరైన దిశలో నడిపించి, దేశ భవిష్యత్తును నిర్మించాలని స్పష్టం చేశారు.

### మార్పు రావాలి..

స్వాతంత్ర్యం వచ్చిన సమయంలో అప్పటి పరిస్థితులను బట్టి శాసనసభ, లోక్‌సభ ఎన్నికల్లో పోటీకి 25 ఏళ్లు, శాసనమండలి, రాజ్యసభకు 30 ఏళ్లను కనీస వయసుగా నిర్ణయించారని సీఎం రేవంత్ గుర్తు చేశారు. కానీ ఇప్పుడు పరిస్థితులు మారాయని.. అందరికీ విద్య అందుబాటులోకి వచ్చిందని, ప్రజల్లో అవగాహనా శక్తి పెరిగిందని చెప్పారు. మన యువత ప్రతి నిమిషం కొత్త విషయాలు నేర్చుకుంటూ ప్రపంచాన్ని గమనిస్తోందని, దేశ నిర్మాణంలో భాగస్వామ్యం కావడానికి సిద్ధంగా ఉందని పేర్కొన్నారు. "ఇప్పుడు 21 ఏళ్ల వయసున్న యువత ఐఏఎ?సలు, ఐపీఎ?సలు అవుతున్నారు. యూనికార్న్ కంపెనీలు స్థాపిస్తున్నారు. ఫార్చ్యూన్-500 కంపెనీలకు సీఈఓలుగా బాధ్యతలు చేపడుతున్నారు. ప్రపంచవ్యాప్తంగా తమ ప్రతిభ, జ్ఞానం, సామర్థ్యాన్ని నిరూపిస్తున్నారు. అలాంటి యువతకు రాజకీయాల్లో నాయకత్వం వహించే అవకాశం ఎందుకు ఇవ్వకూడదు? కాలానుగుణంగా చట్టాలను మార్చాల్సిన అవసరం ఉంది. ఇప్పటివరకు రోడ్లపై పోరాటం చేసిన యువత.. ఇకపై పార్లమెంట్‌లోకి వచ్చి దేశ భవిష్యత్తును నిర్ణయించాలనుకుంటోంది. తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రిగా నాదొక సూచన. ఈ అంశంపై లోతుగా ఆలోచించండి. దేశ ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని చట్టం చేయండి" అని ప్రధాని మోదీని సీఎం రేవంత్ కోరారు. యువతను రాజకీయ వ్యవస్థలో భాగస్వామ్యం చేస్తే.. దేశ భవిష్యత్తు మారుతుందని, ప్రపంచంలోనే శక్తివంతమైన దేశంగా భారత్ ఎదుగుతుందని చెప్పారు. ఈ అంశంపై దేశవ్యాప్తంగా చర్చ జరగాల్సిన సమయం వచ్చిందని తాను భావిస్తున్నానన్నారు.

### అసెంబ్లీలో చర్చించి.. తీర్మానం చేస్తాం

లోక్‌సభ, శాసనసభలకు పోటీచేసే కనీస వయసును 21 ఏళ్లకు తగ్గించే అంశంపైన సమగ్రంగా చర్చించేందుకు ఆగస్టులో రాష్ట్ర శాసనసభ, మండలి సమావేశాలను ఏర్పాటు చేస్తామని రేవంత్ చెప్పారు. ప్రతిపక్షాల అభిప్రాయం కూడా తీసుకుంటామని తెలిపారు. పోటీ కనీస వయసును శాసనసభ, లోక్‌సభలకు 21 ఏళ్లకు, శాసనమండలి, రాజ్యసభలకు 25 ఏళ్లకు తగ్గించాలని తీర్మానం చేస్తామని.. దేశానికి ఒక సందేశం ఇస్తామని వెల్లడించారు.

### ప్రజల మాట వినాల్సిన సమయం వచ్చింది

బీజేపీ ప్రభుత్వాన్ని ఎవరైనా విమర్శిస్తే.. దేశాన్నే విమర్శిస్తున్నారంటూ, అర్బన్ నక్సల్స్, విదేశీ శక్తుల హస్తం ఉందంటూ ఆరోపణలు చేయడం ఆ పార్టీకి అలవాటుగా మారిందని సీఎం రేవంత్ మండిపడ్డారు. మన్ కీ బాత్ పేరుతో రేడియోలో మాట్లాడటం కాదు.. ఇప్పుడు ప్రధాని మోదీ ప్రజల మాట వినాల్సిన సమయం వచ్చిందని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ కూడా 'జై జవాన్- జై కిసాన్' నినాదానికి 'జై యువత'ను కూడా జోడించాల్సిన సమయం వచ్చిందన్నారు.

## ఇక ప్రధాని క్షమాపణకు పట్టు!

విద్యార్థులపై పోలీసుల దాడి
వ్యవహారంలో పార్లమెంటులో నిలదీసేందుకు విపక్షాలు సన్నద్ధం
నేడు ఖర్గే చాంబర్లో కూటమి భేటీ నేడే లోక్‌సభలో పరీక్షల బిల్లు

న్యూఢిల్లీ, జూలై 26 కేంద్ర విద్యామంత్రి ధర్మేంద్రప్రధాన్ రాజీనామా ప్రతిపక్షాల్లో కదనోత్సాహాన్ని పెంచింది. జంతర్‌మంతర్‌లో విద్యార్థులపై పోలీసుల దాడులకు ప్రధాని మోదీ క్షమాపణలు చెప్పేలా పార్లమెంటు వేదికగా ప్రభుత్వంపై మరింత ఒత్తిడి పెంచాలని భావిస్తున్నాయి. మరోవైపు, ప్రశ్నపత్రాల లీకేజీకి పాల్పడితే కఠిన శిక్ష విధించాలని ప్రతిపాదిస్తూ ప్రభుత్వం సోమవారం లోక్‌సభలో చట్టసవరణ బిల్లు తీసుకురానుంది. ఈ నేపథ్యంలో ఇండియా కూటమి నేతలు ఉదయం ఖర్గే చాంబర్‌లో సమావేశమై ఉభయసభల్లో అనుసరించాల్సిన వ్యూహాన్ని సిద్ధం చేయనున్నారు. ఇంకోవైపు, విద్యార్థులపై పోలీసుల దాడి వ్యవహారాన్ని రాజ్యసభలో చర్చించాలని 267వ నిబంధన కింద టీఎంసీ నోటీసిచ్చింది. సోమవారం జీరో అవర్, ప్రశ్నోత్తరాలు, ఇతర కార్యకలాపాలన్నీ సస్పెండ్ చేసి దీనిపై చర్చ జరపాలని ఆ పార్టీ ఎంపీ సాగరికా ఘోష్ అందులో కోరారు.

# ఇందిరమ్మ ఇళ్లకు టెండర్లు

నియోజకవర్గాల్లో.. ఇప్పటివరకు స్థలాలు గుర్తించిన 16 నియోజకవర్గాల్లో ఇందిరమ్మ ఎల్‌ఐజీ టవర్ల నిర్మాణ పనులు చేపట్టేందుకు టెండర్లను ఆహ్వానించింది. బుధవారం (ఈ నెల 29) నుంచి ఆగస్టు 19 మధ్యాహ్నం 3 గంటల వరకు టెండర్లను స్వీకరించనున్నారు. మొత్తం 16 ప్రాంతాల్లో నిర్మించే ఇందిరమ్మ ఎల్‌ఐజీ టవర్లను 10 ప్యాకేజీలుగా విభజించి టెండర్లను ఆహ్వానించారు. ఒక్కో టవర్‌ను స్టిల్ట్ ం 10 అంతస్తులతో నిర్మించాలని టెండర్ నోటీసులో పేర్కొన్నారు. నిర్మాణాన్ని సంప్రదాయ/మోనోలిథిక్ కాంక్రీట్ నిర్మా ణం లేదా మరేదైనా వినూత్న సాంకేతికత (షీర్‌వాల్ టెక్నాలజీ/ప్రీకాస్ట్ టెక్నాలజీ లేదా తెలంగాణ హౌసింగ్ బోర్డు ఆమోదించిన విధంగా)తో ఒక్కో ఫ్లాట్‌ను 528.58 చదరపు అడుగుల విస్తీర్ణంలో నిర్మించాలని పేర్కొన్నారు. దీంతోపాటు నేల పరిస్థితులకు తగిన పునాదులు, సివిల్ పను లు, అంతర్గత మౌలిక సదుపాయాల కింద నీటి సరఫరా, శానిటరీ ఫిట్టింగ్‌లు, అంతర్గత విద్యుదీకరణ, లిఫ్టులు, ఫైర్ సేఫ్టీతో నిర్మాణాలు ఉండాలని టెండర్ నోట?సలో పొందుపరిచారు. అంతేకాకుండా.. ఈ పనులన్నింటికీ రెండేళ్ల డిఫెక్ట్ లయబిలిటీ పీరియడ్ (నిర్మాణంలో ఏవైనా లోపాలు, తప్పులు ఉంటే వాటికి నిర్మాణ సంస్థే బాధ్యత వహించే) నిబంధనను కూడా పెట్టారు. జీహెచ్‌ఎంసీ లైసెన్స్ ఉన్న బిల్డర్లు ఈ టెండర్లలో పాల్గొనవచ్చని పేర్కొన్నారు. కాగా, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో తొలిసారిగా ఇంజనీరింగ్-ప్రొక్యూర్‌మెంట్-కన్‌స్ట్రక్షన్ (ఈపీసీ) విధానాన్ని ప్రవేశపెడుతున్నారు. ఈ విధానం ఎక్కువగా జాతీయ రహదారులు, రాష్ట్రంలోని ప్రత్యేక కారిడార్ల నిర్మాణంలో ఉంటుంది. త్వరితగతిన నిర్మాణం, నాణ్యతతో ఉండేందుకే ఈపీసీ పద్ధతిని తీసుకొస్తున్నట్టు హౌసింగ్ బోర్డు ఇంజినీరింగ్ విభాగం అధికారులు తెలిపారు. హౌసింగ్ బోర్డు టెండర్ నోట?సలో ఇచ్చిన ప్యాకేజీల ప్రకారం.. ఒక్క హైదరాబాద్ జిల్లా పరిధిలోనే దాదాపు 3,500 ఫ్లాట్లు రానున్నాయి. ఆ తరువాత రంగారెడ్డి జిల్లాకు 1,920, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాకు 1,920 చొప్పున ఫ్లాట్లు దక్కనున్నాయి.

### తొలి విడతలోని 10 ప్యాకేజీలు ఇవే..

ప్యాకేజీ-1లో రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్ నియోజకవర్గంలోని మైలార్‌దేవ్‌పల్లిలో 480 ఫ్లాట్లు, మహేశ్వరం నియోజకవర్గం బాలాపూర్ మండలంలోని జల్‌పల్లి వద్ద 480 ఫ్లాట్లు కలిపి మొత్తం 960 ఫ్లాట్లకు రూ.86.40 కోట్లతో టెండర్ ఇచ్చారు.

ప్యాకేజీ-2లో హైదరాబాద్ జిల్లా పరిధిలోని నాంపల్లి వద్ద ఉన్న రెడ్‌హిల్స్‌లో 480 ఫ్లాట్లు, కుల్సుంపురలో 480, బహదూర్‌పురలోని ముసలైగూడలో 480 ఫ్లాట్లు కలిపి మొత్తం 1440 ఫ్లాట్లకు రూ.129.60 కోట్లతో టెండర్. (అన్ని ప్యాకేజీల్లో ఇదే అత్యధికం).

ప్యాకేజీ-3లో రూ.86.40 కోట్లతో రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలంలోని రాయదుర్గంలో 480 ఫ్లాట్లు, షేక్‌పేట మండలంలోని జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే కాలనీలో 360 ఫ్లాట్లు, హకీంపేట దర్గాలో 120 ఫ్లాట్లు.

ప్యాకేజీ-4: హైదరాబాద్ జిల్లా పరిధిలోని సైదాబాద్ మండలం గడ్డిఅన్నారంలో 480 ఫ్లాట్లు, అంబర్‌పేట మండలంలోని అంబర్‌పేట సీపీఎల్‌లో 480 ఫ్లాట్లకు రూ.86.40 కోట్లతో టెండర్.

ప్యాకేజీ-5: రూ.55.80 కోట్లతో బేగంపేట మండలంలోని పాటిగడ్డలో 480 ఫ్లాట్లు, తిరుమలగిరి మండలంలోని బోయిన్‌పల్లిలో 140 ఫ్లాట్లు.

ప్యాకేజీ-6: రూ.43.20 కోట్లతో మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కూకట్‌పల్లి మండలంలోని కేపీహెచ్‌బీ కాలనీలో 480 ఫ్లాట్లు.

ప్యాకేజీ-7: రూ.43.20 కోట్లతో మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కుత్బుల్లాపూర్ మండలంలోని గాజులరామారంలో 480 ఫ్లాట్లు.

ప్యాకేజీ-8: రూ.43.20 కోట్లతో మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా మల్కాజిగిరి మండలంలోని కౌకూర్‌లో 480 ఫ్లాట్లు. ప్యాకేజీ-9: రూ.43.20 కోట్లతో మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ఘట్‌కేసర్ మండలంలోని పోచారం ఎల్‌ఐజీ కాలనీలో 480 ఫ్లాట్లు.

ప్యాకేజీ 10: రూ.43.20 కోట్లతో రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్ మండలంలోని బండ్లగూడ ఎల్‌ఐజీ కాలనీలో 480 ఫ్లాట్లు.

## కార్గిల్ విజయ్ దివస్ వేడుకల్లో కోటపాటి రుక్మారావుకు ఘన సన్మానం



**తరంగాలు ఖమ్మం జిల్లా బ్యూరో :**
కార్గిల్ విజయ్ దివస్ సందర్భంగా మాజీ సైనిక్ ఉద్యోగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఖమ్మం నగరంలో గల ఫ్రీడమ్ పార్క్ లో ఘనంగా నిర్వహించిన కార్యక్రమంలో దళిత రత్న అవార్డు గ్రహీత, హాస్టల్ వెల్ఫేర్ ఫోరం ఖమ్మం జిల్లా అధ్యక్షులు కోటపాటి రుక్మారావును శాలువాతో సత్కరించి జ్ఞాపికను అందజేసి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమానికి జిల్లా ఇంటెలిజెన్స్ ఎస్పీ రామోజీ రమేష్, జిల్లా సైనిక్ వెల్ఫేర్ ఆఫీసర్ చంద్రశేఖర్,మాజీ సైనిక్ ఉద్యోగుల సంక్షేమ సంఘం ప్రచార కార్యదర్శి ఎస్.ఎం. అరుణ్ కుమార్, ఈఎస్ఎం అసోసియేషన్ ఖమ్మం జిల్లా గౌరవ అధ్యక్షులు గోపాల్ రావు, అధ్యక్షులు సుభాని, మాజీ సైనిక్ ఉద్యోగులు హనుమంతరావు, ఎన్.రమేష్, మాజీ సైనికులు తదితరులు పాల్గొని కార్గిల్ అమరవీరులకు ఘన నివాళు లర్పించారు. ఈ సందర్భంగా కోటపాటి రుక్మారావు మాట్లాడుతూ, ఈ సన్మానం తనకు లభించిన విలువైన గుర్తింపుగా భావిస్తున్నానని, తనను గౌరవించిన మాజీ సైనిక్ ఉద్యోగుల సంక్షేమ సంఘం ప్రతినిధులకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. దేశ రక్షణ కోసం ప్రాణత్యాగం చేసిన కార్గిల్ అమరవీరుల త్యాగం ప్రతి భారతీయుడికి స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు.

## రైతులకు అండగా కేసముద్రం వ్యవసాయ శాఖ

- రేపటి నుంచే 'ఆరుతడి విత్తన మేళా'.



**కేసముద్రం, మహబూబాబాద్ జిల్లా, ప్రతినిధి, జూలై.26, తరంగాలు:**
ఎల్-నినో ప్రభావం, వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో కేసముద్రం మండల రైతాంగాన్ని ఆదుకునేందుకు వ్యవసాయ శాఖ ముందడుగు వేసింది. వరి సాగుపై సందిగ్ధంలో ఉన్న రైతులకు తక్కువ నీటితో స్థిరమైన ఆదాయాన్నిచ్చే ఆరుతడి పంటల వైపు మళ్లించేందుకు ప్రత్యేక కార్యాచరణను సిద్ధం చేసింది. ఇందులో భాగంగా జూలై 27 (సోమవారం) నుండి కేసముద్రం 'రైతు వేదిక'లో ప్రత్యేక విత్తన మేళా ప్రారంభం కానుంది. ఈ మేరకు మండల వ్యవసాయ అధికారి వెంకన్న ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు.రైతులకు రవాణా భారం తగ్గించేందుకు, దళారీల దోపిడీని అరికట్టేందుకు అధికారులు సరికొత్త వ్యూహాన్ని అమలు చేస్తున్నారు. నాణ్యమైన కంది, పెసర, మినుము వంటి పప్పుధాన్యాల విత్తనాలను నేరుగా ప్రభుత్వ ఆధ్వర్యంలో రైతు వేదికలోనే అందుబాటులో ఉంచనున్నారు. వీటితో పాటు డిమాండ్ ఎక్కువగా ఉండే మొక్కజొన్న విత్తనాలను సైతం ప్రైవేట్ డీలర్ల సమన్వయంతో అదే ప్రాంగణంలో రైతులకు నేరుగా సరఫరా చేసేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. విత్తనాల కోసం రైతులు పట్టణాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా ఒకే చోట అన్ని రకాలు దొరికేలా చూడటంపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది.ప్రస్తుత నీటి పరిస్థితుల్లో వరి సాగు పెను భారంగా మారే ప్రమాదం ఉందని వ్యవసాయ అధికారి వెంకన్న హెచ్చరించారు. దానికి ప్రత్యామ్నాయంగా తక్కువ పెట్టుబడి, స్వల్ప కాల వ్యవధిలో చేతికి వచ్చే ఆరుతడి పంటలు వేసుకోవాలని సూచించారు. దీనివల్ల భూసారం పెరగడమే కాకుండా, మార్కెట్లో మంచి ధర లభిస్తుందని ఆయన వివరించారు. మండలంలోని రైతాంగమంతా ఈ సువర్ణావకాశాన్ని సద్వినియోగం చేసుకొని, సోమవారం నుండి ప్రారంభమయ్యే విత్తన మేళాకు పెద్ద సంఖ్యలో తరలిరావాలని అధికారులు కోరుతున్నారు.

## శ్రీ సంత్ సేవాలాల్ సమితి సమావేశం: మెంబర్‌షిప్ రుసుము రూ. 1001గా నిర్ణయం



**కేసముద్రం,మహబూబాబాద్ జిల్లా, ప్రతినిధి, జూలై. 26, తరంగాలు:**
స్థానిక మార్కెట్ ఆఫీసు నందు శ్రీ శ్రీ సంత్ సేవాలాల్ సమితి కేసముద్రం కమిటీ సమావేశం ఆదివారం ఘనంగా జరిగింది. ఈ సమావేశంలో సంఘం భవిష్యత్ కార్యాచరణ ప్రణాళికలపై సభ్యులు సుదీర్ఘంగా చర్చించి పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ఈ సందర్భంగా సమితి సభ్యత్వ నమోదును వేగవంతం చేయాలని, ప్రతి సభ్యత్వ నమోదు కోసం రూ. 1001/- రుసుముగా వసూలు చేయాలని ఏకగ్రీవంగా తీర్మానించారు.సంఘాన్ని మరింత బలోపేతం చేసేందుకు సభ్యులందరూ బాధ్యతాయుతంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సమితి అధ్యక్షుడు దాస్రు నాయక్, ప్రధాన కార్యదర్శి బనోత్ వెంకన్న, కోశాధికారి పీమా, నాయకులు భూక్యా వెంకన్నా, శ్రీనివాస్, కార్తీక్ మరియు ఇతర ముఖ్య నాయకులు, సభ్యులు పాల్గొన్నారు.

# రాహుల్ గాంధీని ప్రధాని చేయడమే లక్ష్యం

- ఎమ్మెల్యే కోరం కనకయ్య



**ఇల్లందు ప్రతినిధి జులై 26, ( తరంగాలు) :**
రాహుల్ గాంధీని ప్రధాని చేయడమే లక్ష్యమని ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు తోట దేవి ప్రసన్న అన్నారు. ఆదివారం అయిత కాంప్లెక్స్ నందు పట్టణ అధ్యక్షుడు బోళ్ళ సూర్యం అధ్యక్షతన జరిగిన బిఎల్ఎల సమావేశంలో ఎమ్మెల్యే కోరం కనకయ్య ,జిల్లా అధ్యక్షులు తోట దేవి ప్రసన్న మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీకి సానుకూలంగా ఉన్న ఆదివాసి, లంబాడ, మైనార్టీ కులాలకు చెందిన ఓట్లను తగ్గించడమే లక్ష్యంగా బిజెపి ప్రభుత్వం ఎస్సార్ ను సృష్టించి పశ్చిమ బెంగాల్, బీహార్ రాష్ట్రాలలో బిజెపి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసుకోవడం జరిగిందని, అదేవిధంగా దక్షిణ రాష్ట్రాలైన తమిళనాడు, కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాలలో బీజేపీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడానికి ఎస్ ఐ ఆర్ పేరుతో మైనార్టీ, లంబాడా, ఆదివాసి ఓట్లను తొలగించడమే లక్ష్యంగా పనిచేస్తుందని ప్రతి ఒక్క బీఎల్ఏ కార్యకర్తలు వారి ఓట్లను క్షుణ్ణంగా పరిశీలించి నియోజకవర్గంలో ఓట్లను పోకుండా చూడాలని ఆదేశించారు. ఇప్పటికీ ఇల్లందు నియోజకవర్గంలో 20,332 ఎస్సార్ ఫామ్స్ ను అందించలేదని ఆయా గ్రామపంచాయతీ, వార్డులో ఉన్న బిఎల్ ఎ లందరూ వారి ప్రతి ఇంటిని చేరుకొని వారి సర్ ఫారాలను సేకరించాలని, అలాగే 18 సంవత్సరాలు నిండిన నూతన ఓట్లను చేర్పించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఇల్లందు మున్సిపల్ చైర్మన్ కిరణ్ మిత్ర, మార్కెట్ కమిటీ చైర్మన్ బానోత్ రాంబాబు, జిల్లా యూత్ అధ్యక్షుడు చీకటి కార్తీక్, జిల్లా వైస్ ప్రెసిడెంట్ జీవి భద్రం, ఎట్టి హరికృష్ణ, మైనార్టీ జిల్లా అధ్యక్షులు నయం, ఖమ్మం జిల్లా నాయకులు పుచ్చకాయల వీరభద్రం, పతే అహ్మద్, ఇల్లందు మండల అధ్యక్షులు మండల రాము, టేకులపల్లి అధ్యక్షుడు లక్కినేని శ్యామ్మోహన్, కామే పెల్లి మండల అధ్యక్షుడు గుజ్జర్లపూడి రాంబాబు, బయ్యారం మండల అధ్యక్షుడు సీతారామరెడ్డి, గార్ల మండల అధ్యక్షుడు తాళ్లపల్లి కృష్ణ, సర్పంచులు, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.



# వర్గీకరణ రద్దు చేయాలి... రోస్టర్ విధానం వద్దే వద్దు!

- బీఎంఐ నేతల ఘాటైన డిమాండ్
- నల్గొండలో రాజ్యాంగ హక్కుల పరిరక్షణ సదస్సులో తీర్మానం




నల్గొండ, టౌన్ తరంగాలు న్యూస్ జూలై 26:
భారత రాజ్యాంగం కల్పించిన హక్కులను పరిరక్షించడమే లక్ష్యంగా భీమ్ మిషన్ ఐడియాలజీ (BMI) ఆధ్వర్యంలో ఆదివారం నల్గొండ పట్టణంలోని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ భవన్‌లో రాజ్యాంగ హక్కుల పరిరక్షణ, ఎస్సీ ఉపవర్గీకరణ రోస్టర్ విధానంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా బీఎంఐ నాయకులు మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణను వెంటనే రద్దు చేయాలని, ప్రస్తుతం అమలవుతున్న రోస్టర్ విధానాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. రాజ్యాంగం కల్పించిన సమాన అవకాశాలకు భంగం కలిగించే విధానాలను అంగీకరించబోమని స్పష్టం చేశారు. సదస్సులో పలువురు వక్తలు మాట్లాడుతూ, రిజర్వేషన్లు రాజ్యాంగబద్ధ హక్కు అని, వాటి అమలులో ఏ విధమైన వివక్షకు తావు ఉండకూడదన్నారు. మాల సమాజానికి జరుగుతున్న అన్యాయాలపై ఉద్యోగులు, విద్యార్థులు, యువత, మహిళలు ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. బీఎంఐ అధ్యక్షుడు డి. సర్వయ్య (ఈడీ రిటైర్డ్) మాట్లాడుతూ, రాజ్యాంగ విలువలను కాపాడుకోవడం ప్రతి పౌరుడి బాధ్యత అని అన్నారు. సమాజ హక్కుల పరిరక్షణ కోసం రాష్ట్రవ్యాప్తంగా అవగాహన కార్యక్రమాలను మరింత విస్తృతంగా నిర్వహిస్తామని తెలిపారు. సదస్సులో మాల సంఘాల నాయకులు, ఉద్యోగులు, విద్యార్థులు, మహిళలు, నిరుద్యోగ యువత, సామాజిక కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. చివరగా వర్గీకరణ రద్దు, రోస్టర్ విధానం ఉపసంహరణ, రాజ్యాంగ హక్కుల పరిరక్షణ కోసం ఐక్యంగా ఉద్యమించాలని తీర్మానం చేశారు. ఈ కార్యక్రమంలో చిట్టిబాబు, జి. మల్లేశం, ఎం. చెన్నకేశవులు, జీలుగు రాములు, సింగం వెంకటయ్య, ఏ. జాన్ మోసెస్, సీహెచ్. సురేష్ బాబు, తదితరులు పాల్గొన్నారు



# దగ్గిన ప్రతిసారి తలనొప్పి వస్తుందా..

- అయితే ఈ సమస్యలు ఉన్నాయోమో పరిశీలించండి..



వర్షాకాలంలో జలుబు, దగ్గు వంటి సమస్యలు సాధారణంగా కనిపిస్తాయి. అయితే దగ్గిన ప్రతిసారి తలనొప్పి రావడం మాత్రం సాధారణ విషయం కాదు. చాలా సందర్భాల్లో ఇది తాత్కాలికంగా ఉండి ప్రమాదకరం కాకపోయినా, కొన్నిసార్లు మెదడు లేదా నరాల వ్యవస్థకు సంబంధించిన తీవ్రమైన సమస్యలకు సంకేతంగా ఉండే అవకాశాలు ఉన్నాయని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ముఖ్యంగా కొత్తగా ప్రారంభమైన లేదా తీవ్రంగా ఉన్న దగ్గుతో కూడిన తలనొప్పిని నిర్లక్ష్యం చేయకుండా వైద్య పరీక్షలు చేయించుకోవడం అవసరం. దగ్గినప్పుడు, తుమ్మినప్పుడు, గట్టిగా నవ్వినప్పుడు లేదా మలవిసర్జన సమయంలో ఒత్తిడి పెట్టినప్పుడు తలలో అకస్మాత్తుగా నొప్పి రావడాన్ని కఫ్ హెడేక్ (జశీబస్త్రష్ట ఎముఝుఎష్ట్రవ) అంటారు. ఇది ప్రధానంగా రెండు రకాలుగా ఉంటుంది. ఒకటి ప్రైమరీ కఫ్ హెడేక్, మరొకటి సెకండరీ కఫ్ హెడేక్. ఈ రెండింటి మధ్య తేడాను గుర్తించడం చికిత్సలో కీలకంగా ఉంటుంది.

### తలనొప్పి వస్తే ఏంటి అర్థం..

గట్టిగా దగ్గినప్పుడు ఛాతీ, పొత్తికడుపు భాగాల్లో ఒత్తిడి ఒక్కసారిగా పెరుగుతుంది. ఈ ఒత్తిడి తాత్కాలికంగా మెదడులో రక్తప్రసరణ, ద్రవాల ప్రవాహంపై ప్రభావం చూపుతుంది. దీంతో అకస్మాత్తుగా తలనొప్పి వస్తుంది. ప్రైమరీ కఫ్ హెడేక్‌కు ఇదే ప్రధాన కారణంగా చెప్పవచ్చు. ఈ నొప్పి సాధారణంగా ఒక్కసారిగా మొదలై, పదునుగా లేదా గుచ్చుకున్నట్లుగా అనిపిస్తుంది. కొన్ని సెకన్ల నుంచి కొన్ని నిమిషాల్లోనే తగ్గిపోవడం దీని ప్రత్యేకత. అయితే అన్ని కఫ్ హెడేక్‌లు ప్రమాదరహితమైనవి కావు. కొన్నిసార్లు మెదడులో లేదా దాని చుట్టూ ఉన్న నిర్మాణాల్లో సమస్యలు, సెరెబ్రోస్పైనల్ ద్రవ ప్రవాహంలో లోపాలు, నిర్మాణపరమైన మార్పులు లేదా అరుదుగా మెదడు కణితి వంటి కారణాల వల్ల కూడా సెకండరీ కఫ్ హెడేక్ వస్తుంది. ఈ సందర్భాల్లో దగ్గు అసలు కారణం కాకుండా, ఇప్పటికే ఉన్న సమస్యను బయటపెట్టే ట్రిగ్గర్‌గా పనిచేస్తుంది. సెకండరీ కఫ్ హెడేక్ సాధారణంగా ఎక్కువసేపు కొనసాగుతుంది. దీంతోపాటు ఇతర నరాల సంబంధిత లక్షణాలు కూడా కనిపిస్తాయి. ముఖ్యంగా తల తిరగడం, నడవడంలో సమతుల్యత కోల్పోవడం, చూపు మసకబారడం, చేతులు లేదా కాళ్లలో బలహీనత, తిమ్మిరి, పదేపదే వాంతులు, గందరగోళం, స్పృహ కోల్పోవడం వంటి లక్షణాలు ఉంటే వెంటనే వైద్యుడిని సంప్రదించాలి.

### తీవ్రత ఎక్కువగా ఉంటే..

దగ్గుతో వచ్చే తలనొప్పి మొదటిసారిగా కనిపించినప్పుడు, గతంతో పోలిస్తే తీవ్రంగా ఉన్నప్పుడు, కొన్ని నిమిషాలకంటే ఎక్కువసేపు కొనసాగినప్పుడు లేదా జ్వరంతో పాటు వచ్చినప్పుడు కూడా వైద్య పరీక్షలు చేయించుకోవడం మంచిది. అలాగే స్పృహ తప్పడం, చూపు సమస్యలు, చేతులు లేదా కాళ్లలో బలహీనత వంటి లక్షణాలు ఉంటే ఆలస్యం చేయకుండా ఆస్పత్రికి వెళ్లాలి. కఫ్ హెడేక్ కారణాన్ని గుర్తించేందుకు వైద్యులు ముందుగా లక్షణాలు, వైద్య చరిత్రను పరిశీలిస్తారు. అవసరమైతే ఎంఆర్ఐ లేదా సీటీ స్కాన్ వంటి ఇమేజింగ్ పరీక్షలు సూచిస్తారు. వీటి ద్వారా మెదడులో నిర్మాణపరమైన మార్పులు, సెరెబ్రోస్పైనల్ ద్రవ ప్రవాహంలో సమస్యలు గుర్తించే అవకాశం ఉంటుంది.

## లతా రాజా ఫౌండేషన్ ఆధ్వర్యంలో 22వ జాతీయ సేవా ధార్మిక అవార్డుల ప్రధానోత్సవం




**తరంగాలు ఖమ్మం జిల్లా బ్యూరో :**
సమాజ సేవకు అంకితమైన మహనీయులను సత్కరించడం ద్వారా సేవా స్ఫూర్తిని భావితరాలకు అందించడం ప్రతి ఒక్కరి బాధ్యత అనే ధ్యేయంతో,లతా రాజా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఖమ్మం నగరంలోని ఎస్.ఆర్. గార్డెన్స్‌లో నిర్వహించిన 22వ జాతీయ సేవా ధార్మిక అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమంలోటి జి ఓ స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు ఏలూరి శ్రీనివాసరావు ,టీఎన్ జి ఓ స్ ఖమ్మం జిల్లా అధ్యక్షులు గుంటుపల్లి శ్రీనివాసరావు ,టి జి ఓ స్ ఖమ్మం జిల్లా అధ్యక్షులు కొంగర వెంకటేశ్వరరావు మరియు ఉద్యోగ సంఘ నాయకులు పాల్గొన్నారు. సమాజ సేవలో విశిష్ట సేవలందించిన మహనీయులను ఘనంగా సత్కరించిన ఈ కార్యక్రమం అత్యంత వైభవంగా జరిగింది.




## ఓపెన్ ఇంటర్, ఎస్ఎస్సీ ప్రవేశాలకు
# ఆగస్టు 15 వరకు గడువు

- చదువు మధ్యలో ఆపిన వారికి మరో అవకాశం
- ఆగస్టు 15లోగా ప్రవేశాలు పూర్తి చేసుకోవాలని సూచన

**కేసముద్రం,మహబూబాబాద్ జిల్లా,ప్రతినిధి, జులై.26, తరంగాలు**

కేసముద్రం: 2026--27 విద్యా సంవత్సరానికి ఓపెన్ ఇంటర్, ఓపెన్ ఎస్ఎస్సీ ప్రవేశాల గడువును ఆగస్టు 15 వరకు పొడిగించినట్లు టాస్ కోఆర్డినేటర్, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (కేసముద్రం స్టేషన్) ప్రధానోపాధ్యాయులు గంగుల శ్రీనివాస్ తెలిపారు. కేసముద్రంలో ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేస్తూ.. మధ్యలో చదువు మానేసిన వారు, బడికి దూరమైన వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తిరిగి విద్యను కొనసాగించాలని సూచించారు. చదువును కొనసాగించాలనే ఆసక్తి ఉన్న యువత, ఉద్యోగులు, గృహిణులు, ఇతర అభ్యర్థులకు ఓపెన్ విద్యా విధానం మంచి అవకాశమని పేర్కొన్నారు. సాధారణ పాఠశాలలకు



హాజరు కావడం సాధ్యం కాని వారు కూడా ఈ విధానం ద్వారా పదో తరగతి, ఇంటర్మీడియట్ విద్యను పూర్తి చేసుకోవచ్చన్నారు. ఉన్నత విద్యతో పాటు ఉపాధి అవకాశాలను మెరుగుపర్చుకునేందుకు ఈ ప్రవేశాలు ఉపయోగపడతాయని వివరించారు. అర్హులైన అభ్యర్థులు చివరి తేదీ వరకు వేచి చూడకుండా వెంటనే దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అవసరమైన ధ్రువపత్రాలతో నిర్ణీత గడువులోగా ప్రవేశ ప్రక్రియ పూర్తి చేసుకోవాలని కోరారు. ప్రవేశాలకు సంబంధించిన సందేహాలను టాస్ అధ్యయన కేంద్రంలో నివృత్తి చేసుకోవచ్చన్నారు. గ్రామీణ ప్రాంతాలకు చెందిన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ విద్యాభ్యాసాన్ని పునఃప్రారంభించాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వం కల్పిస్తున్న ఈ అవకాశాన్ని వదులుకోకుండా విద్యా లక్ష్యాలను చేరుకోవాలని ఆకాంక్షించారు. పూర్తి వివరాలకు టాస్ అసిస్టెంట్ కోఆర్డినేటర్ అగుర్తి సురేష్‌ను 9291653497లో సంప్రదించాలని తెలిపారు.

## నల్గొండలో అట్టహాసంగా
# 18వ ఈశా గ్రామోత్సవం వేడుకలు



**నల్గొండ జులై 26, తరంగాలు :**
నల్గొండలోని కోమటిరెడ్డి ప్రతీక్ రెడ్డి మెమోరియల్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 18వ ఈశా గ్రామోత్సవం అట్టహాసంగా జరిగింది. ఈశా ఫౌండేషన్ జూలై 26న నిర్వహించిన ఈ క్రీడా పోటీల్లో పురుషుల వాలీబాల్, మహిళల త్రోబాల్ విభాగాల్లో క్రీడాకారులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి శ్రీ శేఖర్ రెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేసి, గ్రామీణాభివృద్ధికి నాణ్యమైన నేల, గాలి, నీరు ఎంత ముఖ్యమో, గ్రామాల్లో ఆరోగ్యం, ఐక్యతను పెంపొందించడంలో ఇటువంటి క్రీడా కార్యక్రమాలు కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. నల్గొండ వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ సబ్-ఇన్‌స్పెక్టర్ శ్రీ సైదులు, కోమటిరెడ్డి ప్రతీక్ రెడ్డి మెమోరియల్ ప్రభుత్వ ఒకేషనల్ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీ ఉపెందర్ కూడా ఈ కార్యక్రమానికి అతిథులుగా విచ్చేసి ఆటగాళ్లను ఉత్తేజపరిచారు. ఆటగాళ్లు, ఇంకా పోటీలను వీక్షించడానికి వచ్చిన గ్రామస్థులు ఎంతో ఉత్సాహంగా వేడుకలో పాల్గొన్నారు. కోలాటంతో ముఖ్య అతిథులకు ఘన స్వాగతం పలికారు. ఏడుగురు చిన్నారులు ప్రదర్శించిన భరతనాట్యం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. అనంతరం ముఖ్య అతిథులు త్రోబాల్ పోటీలను ప్రారంభించి, క్రీడాకారులతో కలిసి కొంతసేపు ఆటలో పాల్గొని వారిని ప్రోత్సహించారు. అలాగే తలపై నీటి గ్లాసుతో నడిచే పోటీ, జంటగా ఒక కాలిపై గెంతే పోటీ, బెలూన్ ఆటలు, హంస నడక వంటి సరదా ఆటలు ప్రేక్షకులను అలరించాయి. 2004లో సద్గురు ప్రారంభించిన ఈశా గ్రామోత్సవం, గ్రామీణ భారతదేశ స్ఫూర్తిని పునరుజ్జీవింపజేయడానికి ఉద్దేశించినది. ఆంధ్రప్రదేశ్ ఇంకా తెలంగాణలలో 15 జిల్లాలలో ఈ పోటీలు నిర్వహించబడతాయి. జూలై 18 నుంచి సెప్టెంబర్ 6 వరకు క్లస్టర్ జిల్లా స్థాయి, డివిజనల్ రాష్ట్ర స్థాయి, ఫైనల్ - 3 దశల్లో మ్యాచ్‌లు నిర్వహించబడతాయి. ప్రతి స్థాయిలో మొదటి నాలుగు స్థానాల్లో నిలిచిన జట్లకు మెరిట్ సర్టిఫికెట్ మరియు నగదు బహుమానం ఉంటుంది. సద్గురు ఇంకా వేలాది మంది సమక్షంలో ఫైనల్ ఈవెంట్ ఈ ఏడాది సెప్టెంబర్ 6న ఈశా యోగా సెంటర్, కోయంబత్తూరులోని ఆదియోగి వద్ద జరగనుంది. విజేత జట్లకు ఈశా రిజువినేషన్ ట్రోఫీతో పాటు నగదు బహుమతులు - వాలీబాల్ పురుషులు రూ. 5 లక్షలు, త్రోబాల్ మహిళలు రూ. 5 లక్షలు. మొత్తంగా కోటి రూపాయలకు పైగా నగదు బహుమతులు ఉంటాయి.



## శ్రీనివాస్ యాదవ్ దశదిన కార్యక్రమంలో పాల్గొన్న పుట్టా ఉపేందర్ యాదవ్



**ఇల్లందు ప్రతినిధి జూలై 26,( తరంగాలు ):**
ఖమ్మం రామ కృష్ణ ఫంక్షన్ హాల్ లో చంద్ర కాని శ్రీనివాస్ యాదవ్ దశ దిన కార్య క్రమానికి హాజరై, ఆయన చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించిన టిడిపి ఇల్లందు మండల అధ్యక్షులు పుట్టా ఉపేందర్ యాదవ్, ఆయన వెంట చిన్న నాగరాజు యాదవ్, మేకల మల్లి కార్జున యాదవ్, నన్నెబోయిన సురేష్ యాదవ్, అదునూరి సతీష్, ఎస్.కె ఉస్మాన్ బాయి, పాలపొంగు వెంకట్,గుంటి రాజు యాదవ్, వీర్ల సురేష్ యాదవ్,బుర్రి లింగయ్య యాదవ్, మద్దెబోయిన ఉపేందర్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## దేశ నిర్మాణంలో యువత భాగస్వామ్యం అత్యంత కీలకం

- ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ



**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బ్యూరో తరంగాలు న్యూస్ జూలై 26**
యువజన వ్యవహారాలు మరియు క్రీడల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని మై భారత్ నిర్వహించిన వికసిత్ వైబ్రంట్ విలేజ్ కార్యక్రమం--2026లో పాల్గొన్న యువతతో నేడు వర్చువల్ విధానంలో సంభాషించారు. దేశవ్యాప్తంగా 245 జిల్లాలకు చెందిన 5,000 మందికి పైగా మై భారత్ వాలంటీర్లు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. యువత దేశంలోని వివిధ ప్రాంతాలను సందర్శించి తమ అనుభవాలను నమోదు చేసి, సామాజిక మాధ్యమాల ద్వారా ఇతరులతో పంచుకోవాలని, తద్వారా జాతీయ సమైక్యతను మరింత బలోపేతం చేయాలని ప్రధానమంత్రి సూచించారు. హైదరాబాద్ మై భారత్ కేంద్రానికి చెందిన భవ్య, ఉత్తరకాశిలోని హర్షిల్ లోయను సందర్శించిన తన అనుభవాలను పంచుకుంటూ, అభివృద్ధి మరియు మెరుగైన మౌలిక సదుపాయాల వల్ల సరిహద్దు గ్రామాల్లో చోటుచేసుకున్న మార్పులను వివరించారు. ఈ సందర్భంగా ప్రధానమంత్రి, ఒకప్పుడు దేశంలోని చివరి గ్రామాలుగా భావించిన సరిహద్దు గ్రామాలు నేడు దేశంలోని తొలి గ్రామాలుగా గుర్తింపు పొందుతున్నాయని పేర్కొన్నారు. వికసిత్ భారత్ -2047 లక్ష్య సాధనకు దోహదపడే ఇటువంటి అనుభవాధారిత కార్యక్రమాల్లో యువత మరింత చురుకుగా పాల్గొనాలని ఆయన పిలుపునిచ్చారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు చెందిన యువత, జిల్లా యువజన మరియు క్రీడల అధికారి పరంధామ రెడ్డి, మేరా యువ భారత్ నోడల్ అధికారి కమరతపు భాను చందర్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టరేట్ నుంచి ప్రధానమంత్రి నిర్వహించిన ఈ వర్చువల్ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# మహబూబాబాద్ జిల్లా ప్రైవేట్ టీచర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గం

- రెండోసారి జిల్లా అధ్యక్షుడిగా గండు మురళి ఏకగ్రీవ ఎన్నిక.. ఉపాధ్యాయ లోకం హర్షం!

**మహబూబాబాద్ జిల్లా, ప్రతినిధి, జులై.26, తరంగాలు:**
భవిష్యత్ తరాలను తీర్చిదిద్దడంలో అహర్నిశలు శ్రమిస్తున్న ప్రైవేట్ ఉపాధ్యాయుల అభ్యున్నతికి నిరంతరం తోడుంటామని మహబూబాబాద్ జిల్లా ప్రైవేట్ టీచర్స్ అసోసియేషన్ నూతన కమిటీ సభ్యులు ఆకాంక్షించారు. ఆదివారం జరిగిన అసోసియేషన్ సర్వసభ్య సమావేశంలో సభ్యులందరూ ఏకగ్రీవంగా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఉపాధ్యాయుల పట్ల ఆయన చేసిన సేవలను గుర్తించి, జిల్లా అధ్యక్షుడిగా గండు మురళిని వరుసగా రెండోసారి ఏకగ్రీవంగా ఎన్నుకోవడం విశేషం.

### సేవారంగంలో నూతన సారథులు.

జిల్లా సారథి (అధ్యక్షుడు): గండు మురళి, ఉపాధ్యక్షులు: సొల్లేటి వెంకన్న, సుధాకర్, వడ్లకొండ కుమారస్వామి, ప్రధాన కార్యదర్శి (జనరల్ సెక్రెటరీ): చేపూరి వెంకన్న,సంయుక్త




కార్యదర్శులు (జాయింట్ సెక్రెటరీలు): సలీం, ఉపేందర్, ఆర్థిక సంరక్షకుడు (కోశాధికారి): మాశెట్టి రాంబాబు, మార్గదర్శి (గౌరవ సలహాదారు): సత్తార్సమాచార సారథి (సోషల్ మీడియా కన్వీనర్): బట్టు పృద్వి,సంఘ నిబంధనల మేరకు ఈ నూతన కార్యవర్గం రెండేళ్ల పాటు బాధ్యతల్లో కొనసాగుతుంది.

### ఉపాధ్యాయుల సంక్షేమానికి కట్టుబడి ఉంటాం.

తమపై నమ్మకంతో ఈ బాధ్యతలు అప్పగించిన ప్రతి ఒక్కరికీ నూతన కమిటీ సభ్యులు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..ప్రైవేట్ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారమే మా మొదటి ప్రాధాన్యత. వారి సంక్షేమానికి, ఆత్మగౌరవ రక్షణకు అన్ని వేళలా అండగా ఉంటాం అని భావోద్వేగంగా ప్రకటించారు. నూతన కమిటీ ఎన్నిక పట్ల జిల్లావ్యాప్తంగా ఉన్న ప్రైవేట్ ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేస్తూ, సరికొత్త కమిటీ నాయకత్వంలో అసోసియేషన్ మరింత ముందుకు సాగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

## కళ్యాణ్ స్మారకార్థం రక్తదాన శిబిరం

• యువత సేవాభావానికి నిదర్శన



**ఐనవోలు, జూలై 26,తరంగాలు :** అయినవోలు మండలం పంతిని గ్రామానికి చెందిన కొమ్మోజు భరద్వాజ్ (కళ్యాణ్) ఇటీవల అకాల మరణం చెందగా, ఆయన జ్ఞాపకార్థం కళ్యాణ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని కళ్యాణ్ సోదరుడు శివతో పాటు ఆయన మిత్రులు సంయుక్తంగా ఏర్పాటు చేశారు.గ్రామంలోని యువత, పెద్దలు అధిక సంఖ్యలో పాల్గొని రక్తదానం చేసి కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ సందర్భంగా గ్రామ పెద్దలు మాట్లాడుతూ, "ఒకరి రక్తదానం ఆపదలో ఉన్న మరొకరి ప్రాణాలను కాపాడుతుంది. ప్రతి ఆరోగ్యవంతుడు స్వచ్ఛందంగా రక్తదానం చేయాలి" అని పిలుపునిచ్చారు.కళ్యాణ్ ఫౌండేషన్ సభ్యులు మాట్లాడుతూ, రక్తదాన శిబిరం నిర్వహణకు సహకరించిన హనుమకొండ ప్రభుత్వ మిషన్ ఆసుపత్రి బ్లడ్ సెంటర్ వైద్య సిబ్బందికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అలాగే కార్యక్రమాన్ని విజయవంతం చేసిన గ్రామస్తులు, మిత్రులు, స్వచ్ఛంద రక్తదాతలకు ధన్యవాదాలు తెలియజేశారు.రక్తదాన శిబిర నిర్వాహకులు మాట్లాడుతూ, ఆపదలో ఉన్న రోగులకు ప్రాణదాతలుగా నిలిచిన రక్తదాతలను అభినందించారు. యువత ఇలాంటి సామాజిక సేవా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొని సమాజానికి ఆదర్శంగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో పాల్గొన్న రక్తదాతలను బ్లడ్ సెంటర్ నిర్వాహకులు అభినందిస్తూ ప్రశంసాపత్రాలు అందజేశారు.

## కార్గిల్ దివస్ --136వ మన్ కీ బాత్ కార్యక్రమంలో పాల్గొన్న డాక్టర్ వన్నాల వెంకట రమణ



**హైదరాబాద్, జూలై 26,తరంగాలు** : కార్గిల్ దివస్ --136వ మన్ కీ బాత్ కార్యక్రమంలో డాక్టర్ వన్నాల వెంకట రమణ పాల్గొన్నారు.సికింద్రాబాద్ కంటోన్మెంట్‌లోని వార్డు నంబర్--3, పోలింగ్ బూత్ నం. 68 వద్ద అఖిల భారత పూర్వ సైనిక్ సేవ పరిషత్ ఆధ్వర్యంలో ఆదివారం కార్గిల్ దివస్ సందర్భంగా ప్రత్యేక కార్యక్రమంతో పాటు 136వ ప్రధాన మంత్రి మన్ కీ బాత్ (మోదీ మనసులో మాట) కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా తెలంగాణ రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు, ఎంపీ ఈటల రాజేందర్ హాజరయ్యారు. వారితో పాటు బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ వన్నాల వెంకట రమణ పాల్గొన్నారు. కార్యక్రమంలో సుమారు 200 మంది ఆర్మీ అధికారులు, మాజీ సైనికులు పాల్గొని కార్గిల్ యుద్ధ వీరులకు ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ప్రసంగించిన 136వ మన్ కీ బాత్ కార్యక్రమాన్ని వీక్షించారు.ఈ కార్యక్రమంలో మాజీ శాసనసభ్యులు కొండేటి శ్రీధర్, గువ్వల బాలరాజు, విశ్రాంత కల్నల్‌లు, మాజీ సైనికులు, రాష్ట్ర పార్టీ నాయకులు, పదాధికారులు తదితరులు పాల్గొన్నారు.

## సర్ పై ప్రతి ఒక్కరు దృష్టి సారించాలి

• నిరంతరం నాయకులతో కలిసి సర్ ప్రక్రియలో పాల్గొంటున్న ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు



వర్ధన్నపేట ప్రతినిధి, జులై 26,తరంగాలు : సర్ ప్రక్రియలో భాగంగా ఏ ఒక్కరి ఓటు హక్కు కోల్పోకుండా బిఎల్ఏ నిరంతరం కృషి చేయాలని వర్ధన్నపేట ఎమ్మెల్యే, విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు అన్నారు.ఆదివారం సాయంత్రం 55వ డివిజన్ సర్ ప్రక్రియ హెల్ప్ డెస్క్ సెంటర్ ను సందర్శించారు.బూత్‌లలో ఏ ఒక్క ఓటు కోల్పోకుండా సర్ ప్రక్రియ పూర్తయ్యే వరకు బాధ్యతతో పనిచేయాలని సూచించారు.ప్రతి ఓటరు తప్పనిసరిగా ఎస్ఐఆర్ కార్యక్రమంలో పాల్గొని ఎన్యూమరేషన్ ఫారం నింపేలా బూత్ ఏజెంట్లు ప్రజలకు అవగాహన కల్పించి ఈ ప్రక్రియను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.కొంత మంది ఓటర్లను ఫోన్ లో సంప్రదించి సర్ ప్రక్రియలో వివరాలను నమోదు చేసుకునేలా అవగాహన కల్పించారు.సాయంత్రం 8గంటల వరకు సర్ ప్రక్రియలో విధులు నిర్వహిస్తున్న బూత్ లెవెల్ ఏజెంట్లకు ఎమ్మెల్యే అభినందించారు.ఈ కార్యక్రమంలో 55వ డివిజన అధ్యక్షులు గడ్డం అరుణ్,సీనియర్ నాయకులు శివరాం ,సునీల్, సుమంత్, రాకేష్,శ్రీకాంత్ ,నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



# ధన్వంతరి ఎక్సలెన్స్ అవార్డుతో

## డాక్టర్ వన్నాల వెంకట రమణకు ఘన సత్కారం




**హైదరాబాద్, జూలై 26,తరంగాలు :** బీజేపీ రాష్ట్ర మెడికల్ సెల్ కన్వీనర్ డాక్టర్ కొప్పుల రాజశేఖర్ ఆధ్వర్యంలో నిర్వహించిన "తెలంగాణ ఆరోగ్య సంరక్షణ విధానంపై రాష్ట్ర స్థాయి సదస్సు" మరియు ధన్వంతరి ఎక్సలెన్స్ అవార్డ్స్ కార్యక్రమం ఘనంగా జరిగింది.ఈ కార్యక్రమానికి బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు, రాజ్యసభ సభ్యుడు డాక్టర్ కె. లక్ష్మణ్, ఎమ్మెల్యే రాకేష్ రెడ్డి, డాక్టర్ పాల్వాయి హరీష్ బాబు, మాజీ ఎంపీ బూర నర్సయ్య గౌడ్, మధ్యప్రదేశ్ రాష్ట్ర ఇంచార్జి మురళీధర్ రావు తదితరులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.రాష్ట్ర నలుమూలల నుంచి సుమారు 500 మంది వైద్యులు ఈ సదస్సులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ వన్నాల వెంకట రమణ ప్రత్యేక అతిథిగా హాజరై పలువురు ప్రతిభావంతులైన వైద్యులకు ముఖ్య అతిథులతో కలిసి ధన్వంతరి ఎక్సలెన్స్ అవార్డులు అందజేశారు.అదే కార్యక్రమంలో వైద్య రంగానికి ఆయన అందిస్తున్న విశిష్ట సేవలను గుర్తిస్తూ డాక్టర్ వన్నాల వెంకట రమణను కూడా ధన్వంతరి ఎక్సలెన్స్ అవార్డుకు ఎంపిక చేసి, ముఖ్య అతిథుల చేతుల మీదుగా అవార్డును ప్రదానం చేశారు.ఈ సందర్భంగా పలువురు నాయకులు, వైద్యులు డాక్టర్ వన్నాల వెంకట రమణకు అభినందనలు తెలియజేస్తూ, వైద్య సేవలతో పాటు సామాజిక సేవా కార్యక్రమాల్లో ఆయన చేస్తున్న కృషి ప్రశంసనీయమని కొనియాడారు.




## నటరాజ డాన్స్ అకాడమీ విద్యార్థినులకు కూచిపూడిలో ప్రథమ, ద్వితీయ బహుమతులు





• తిరుమలలో జాతీయ కూచిపూడి నాట్య మహోత్సవం

***తిరుమల, జులై 26,తరంగాలు*** **:** తిరుమల తిరుపతి దేవస్థానంలో అభినయ ఆర్ట్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ కూచిపూడి నాట్య కళా మహోత్సవంలో హైదరాబాద్ కుషాయిగూడకు చెందిన నటరాజ డాన్స్ అకాడమీ విద్యార్థినులు ప్రతిభ కనబర్చి ప్రథమ, ద్వితీయ బహుమతులను కైవసం చేసుకున్నారు.ఈ సందర్భంగా నటరాజ డాన్స్ అకాడమీ వ్యవస్థాపకురాలు, గురువు మౌనిక నర్సింగరావు మాట్లాడుతూ, గత 26 సంవత్సరాలుగా తిరుమలలో శ్రీ వేంకటేశ్వర స్వామి సన్నిధిలో అభినయ ఆర్ట్స్ జాతీయ నాట్య పోటీలను విజయవంతంగా నిర్వహిస్తోందని తెలిపారు. ప్రతి సంవత్సరం తమ అకాడమీకి చెందిన పలువురు విద్యార్థులతో కలిసి కూచిపూడి నృత్య ప్రదర్శనలు ఇవ్వడం ఎంతో ఆనందంగా ఉందన్నారు.తిరుమల తిరుపతి దేవస్థానం,అభినయ ఆర్ట్స్ సంస్థ అందిస్తున్న సహకారం, కళాకారులకు కల్పిస్తున్న ప్రోత్సాహం అభినందనీయమని ఆమె పేర్కొన్నారు. కార్యక్రమ నిర్వహణతో పాటు కళా ప్రదర్శనల స్థాయి కూడా ఎంతో ఉన్నతంగా ఉందని కొనియాడారు.ఈ కార్యక్రమంలో అభినయ ఆర్ట్స్ కార్యదర్శి బి.ఎన్. రెడ్డి, తిరుమల తిరుపతి దేవస్థానం బోర్డు సభ్యులు భాను ప్రకాష్, తిరుమల అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ చైర్మన్ నాగేంద్రతో పాటు పలువురు ప్రముఖులు పాల్గొని విజేతలకు బహుమతులు అందజేశారు.





THARANGALU DAILY NEWS
సోమవారం, 27 జూలై, 2026
జాతీయ దిన పత్రిక
తరంగాలు

# వర్ధన్నపేటలో సర్ కార్యక్రమంపై కాంగ్రెస్ బీఎల్ఏల సమావేశం





**వర్ధన్నపేట ప్రతినిధి , జూలై 26,తరంగాలు** : వర్ధన్నపేట నియోజకవర్గ కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (సర్ ) కార్యక్రమానికి సంబంధించి కాంగ్రెస్ పార్టీ బీఎల్ఏల (బూత్ లెవల్ ఏజెంట్లు) సమావేశం నిర్వహించారు.వర్ధన్నపేట శాసనసభ్యులు కె.ఆర్. నాగరాజు,వరంగల్ జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు కె.ఆర్. దిలీప్ ఆదేశాల మేరకు మండల కాంగ్రెస్ అధ్యక్షుడు పోశాల వెంకన్న గౌడ్ ఆధ్వర్యంలో ఈ సమావేశం జరిగింది. మండలంలోని అన్ని గ్రామాల బీఎల్ఏలు సమావేశానికి హాజరయ్యారు.ఈ సందర్భంగా బిర్రు రాజు బీఎల్ఏలకు సర్ కార్యక్రమంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, నిర్వహణ విధానంపై దిశానిర్దేశం చేశారు.అనంతరం వర్ధన్నపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ నరుకుడు వెంకటయ్య, కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు ఎద్దు సత్య నారాయణ మాట్లాడుతూ, ఓటరు జాబితాలో చనిపోయిన వారి పేర్లను సక్రమంగా గుర్తించి తొలగించాలని, మ్యాపింగ్‌ను ఖచ్చితంగా పూర్తి చేయాలని, పేర్లలో స్పెల్లింగ్ తప్పులు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని బీఎల్ఏలకు సూచించారు.ఈ సమావేశంలో సర్పంచ్‌లు చిటూరి రాజు, దుబ్బ అంజయ్య, దశరథం, రజాక్, ఉప సర్పంచ్‌లు నాంపెల్లి రవీందర్, సంకినేని గంగరాజు, మండల యూత్ ఉపాధ్యక్షుడు కుల్ల యాకంతం, ఎస్సీ సెల్ మాజీ జిల్లా అధ్యక్షుడు తుల్ల రవి, మైనార్టీ, ఎస్సీ విభాగాల మండల అధ్యక్షులు ఎం.డి. అక్బర్, దామెర ప్రశాంత్, కాంగ్రెస్ నాయకులు తాళ్లపెల్లి యాదగిరి గౌడ్, మైదం బుచ్చి మల్లు, మరుపట్ల సాయికుమార్, గుంటి కుమారస్వామి, గడ్డం సమ్మయ్య, ఎద్దు రాజేంద్ర ప్రసాద్, చిధుముల్ల భాస్కర్, మెరుగు రమేశ్, దుబ్బ యాకయ్య, మెడ సుధాకర్, కిషన్ నాయక్, ఆరెల్లి నాగరాజు, మాజీ సర్పంచ్ సింధం లక్ష్మీనారాయణ, కాంధిక రాజు, భూక్యా శంకర్, ఉప్పునూతుల రాములు, బిర్రు సుధాకర్, మరుపట్ల ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

# బలాకా,విజయామాతగా భక్తులకు దర్శనమిచ్చిన అమ్మవారు



• 12వ రోజుకు చేరిన భద్రకాళీ అమ్మవారి శాకంభరీ నవరాత్రులు

**వరంగల్ ప్రతినిధి, జులై 26,తరంగాలు** : వరంగల్ మహానగరంలోని చరిత్ర ప్రసిద్ధిగాంచిన శ్రీ భద్రకాళీ దేవస్థానంలో జరుగుతున్న శాకంభరీ నవరాత్ర మహోత్సవాలు ఆదివారం 12వ రోజుకు చేరుకున్నాయి.ఉదయం 5 గంటలకు నిత్యాహ్నిక కార్యక్రమాలు పూర్తిచేసిన అనంతరం తిథిమండల దేవతాయజనంలో భాగంగా కాళీ క్రమానుసారం అమ్మవారి ఉత్సవమూర్తులను ఇచ్ఛాశక్తి స్వరూపిణి “బలాకా”, షోడశీ క్రమానుసారం జ్ఞానశక్తి స్వరూపిణి “విజయామాత”గా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఆలయ ప్రధానార్చకులు భద్రకాళి శేషు మాట్లాడుతూ, దశమహావిద్యలలో ఆద్యవిద్య అయిన కాళీ సపర్యా క్రమంలో ద్వాదశి అధిదేవత బలాకా అని తెలిపారు. బలాకా అమ్మవారు భక్తుల శత్రువులపై పిడుగుల వర్షాన్ని కురిపించి శత్రునాశనం చేస్తారని, విజయామాత భక్తులకు విజయాన్ని ప్రసాదిస్తారని పేర్కొన్నారు. అందుకే శత్రునాశనం, విజయప్రాప్తి కోసం భక్తులు ఈ రెండు స్వరూపాలను ప్రత్యేకంగా ఆరాధిస్తారని వివరించారు.ఆదివారం కావడంతో రాష్ట్రంలోని పలు ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి భద్రకాళీ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు



నిర్వహించిన్నట్లు కార్యనిర్వహణ అధికారి రామల సునీత తెలిపారు.

# లెనిన్ నగర్‌లో ఉచిత మెగా హెల్త్ క్యాంప్ విజయవంతం




**వరంగల్ ప్రతినిధి , జూలై 26, తరంగాలు** : వరంగల్ నగరంలోని లెనిన్ నగర్ కాలనీ వాసుల కోసం జెపీఎన్ రోడ్‌లోని దేవ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత మెగా హెల్త్ క్యాంప్ విజయవంతంగా నిర్వహించారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు జరిగిన ఈ వైద్య శిబిరంలో కాలనీకి చెందిన ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని ఉచిత వైద్య సేవలను పొందారు.ఈ సందర్భంగా ప్రముఖ వైద్యులు డా. దేవ విశాల్ రాజ్ (ఎండీ , జనరల్ ఫిజీషియన్) మరియు డా. దేవ సహస్ర రాజు (పీడియాట్రిక్ స్పెషలిస్ట్) ఆధ్వర్యంలో చిన్నారులు, పెద్దలకు ఉచిత ఆరోగ్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన వైద్య సలహాలు అందించారు.కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కంచ ప్రసాద్ (సికింద్రాబాద్ మెట్రోపాలిటన్ జడ్జి) మాట్లాడుతూ, గతంలో రోటరీ క్లబ్ ద్వారా లెనిన్ నగర్ ప్రజలకు వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేయడం, ప్రస్తుతం దేవ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించడం వంటి సేవా కార్యక్రమాలు పేద ప్రజలకు ఎంతో ఉపయోగపడుతున్నాయని అన్నారు. సమాజ సేవలో ముందుంటున్న దేవ హాస్పిటల్ యాజమాన్యాన్ని ఆయన అభినందించారు.ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ గుండు చందన -- పూర్ణ చందర్, పద్మశాలి యువజన సంఘం అధ్యక్షులు భేటీ అశోక్ బాబు, దేవ హాస్పిటల్ యజమాని దేవ మహేందర్, లెనిన్ నగర్ అభివృద్ధి కమిటీ సభ్యులు రాకేష్, కమలాకర్ తదితరులు పాల్గొని వైద్య సేవలను అభినందించారు. కాలనీవాసులు మాట్లాడుతూ, ప్రజల ఆరోగ్య పరిరక్షణ కోసం ఇటువంటి ఉచిత వైద్య శిబిరాలను భవిష్యత్తులో మరిన్ని నిర్వహించాలని ఆకాంక్షించారు.




# వేగంగా పెరుగుతున్న ఫ్యాటీ లివర్ సమస్య..

• ఆహారంలో మార్పులు చేసుకోవడం అవసరం..



ఫ్యాటీ లివర్ అంటే లివర్ కణాల్లో కొవ్వు ఎక్కువగా పేరుకుపోవడం. ఇది భారత్‌లో వేగంగా పెరుగుతున్న అనారోగ్య సమస్యల్లో ఒకటి. మారిన జీవన విధానం, ఆహారపు అలవాట్లు, వ్యాయామం చేయకపోవడం, మద్యపానం వంటి వాటిని ఈ సమస్యకు ప్రధాన కారణాలుగా చెప్పవచ్చు. ఫ్యాటీ లివర్ సమస్యను సరైన సమయంలో నియంత్రించకపోతే భవిష్యత్తులో తీవ్రమైన అనారోగ్య సమస్యలకు దారి తీస్తుంది. అయితే సరైన ఆహారం, జీవనశైలి మార్పులతో ఈ సమస్యను నియంత్రించవచ్చు. ఫ్యాటీ లివర్ సమస్య తగ్గడానికి సహాయపడే ఉత్తమ ఆహారాలను ఆహారంలో చేర్చుకోవడం ద్వారా సమస్య తగ్గడంతో పాటు కాలేయ ఆరోగ్యం కూడా మెరుగుపడుతుందని వైద్యులు చెబుతున్నారు. ఫ్యాటీ లివర్ సమస్యను తగ్గించి కాలేయ ఆరోగ్యాన్ని మెరుగుపరిచే కొన్ని ఆహారాల గురించి ఇప్పుడు తెలుసుకుందాం.

### లివర్ ఎంజైమ్‌లు తగ్గేందుకు..

రోజుకు మూడు కప్పులు బ్లాక్ కాఫీ చక్కెర లేకుండా తాగడం వల్ల లివర్ ఎంజైమ్ స్థాయిలు తగ్గుతాయి. లివర్ ఎంజైమ్ స్థాయిలను తగ్గించడంలో కాఫీ సహాయపడుతుంది. అలాగే లివర్ వాపు, ఫైబ్రోసిస్, సిరోసిస్ ప్రమాదాన్ని కూడా కాఫీ తగ్గిస్తుంది. కాఫీలో ఉన్న యాంటీ ఆక్సిడెంట్లు, పాలీఫినాల్స్ లివర్ కణాలను రక్షించడంలో దోహదపడతాయి. బ్లూబెర్రీ, రాస్ప్‌బెర్రీ, స్ట్రాబెర్రీ వంటి పండ్లలో ఫైబర్, యాంటీ ఆక్సిడెంట్లు, పాలీఫినాల్స్ ఎక్కువగా ఉంటాయి. ఇవి లివర్‌లో ఆక్సీకరణ ఒత్తిడిని తగ్గించడంలో సహాయపడతాయి. ఈ పండ్లను రోజువారీ ఆహారంలో భాగంగా తీసుకోవడం ద్వారా ఆక్సీకరణ ఒత్తిడి తగ్గి దీర్ఘకాలిక కాలేయ వ్యాధుల బారిన పడకుండా ఉంటారు.

### లివర్‌లో కొవ్వు తగ్గాలంటే..

అలాగే ఎక్స్‌ట్రా వర్జిన్ ఆలివ్ ఆయిల్‌లో ఆరోగ్యకరమైన కొవ్వులు , పాలీఫినాల్స్ ఉంటాయి. ఇది లివర్‌లో కొవ్వు తగ్గించడంలో, మెటాబాలిజం మెరుగుపరచడంలో సహాయపడుతుంది. అదే విధంగా బాదం, అక్రోట్, పిస్తా వంటి నట్స్‌లో ఆరోగ్యకరమైన కొవ్వులు, ఫైబర్, యాంటీ ఆక్సిడెంట్లు ఉంటాయి. రోజూ వీటిని తగిన మోతాదులో తీసుకోవడం ద్వారా మెటాబాలిక్ ఆరోగ్యం మెరుగుపడుతుంది. ఫ్యాటీ లివర్ ప్రమాదం కూడా తగ్గుతుంది.

### ఆకుకూరలు, కూరగాయలు..

ఫ్యాటీ లివర్ సమస్యను తగ్గించడంలో ఆకుకూరలు, కూరగాయలు కూడా ఎంతో సహాయపడతాయి. ఆకుకూరలు లివర్‌లో కొవ్వు పేరుకుపోవడాన్ని, వాపులను తగ్గిస్తాయి. పాలకూర, కేల్, బ్రోకలీ, క్యాబేజీ, కాలిఫ్లవర్, బ్రస్సెల్స్ స్ప్రౌట్స్ వంటి ఆహారాలను తీసుకోవడం ద్వారా ఫ్యాటీ లివర్ సమస్య తగ్గడంతో పాటు కాలేయ ఆరోగ్యం మెరుగుపడుతుంది. ఇక ఫైబర్, మొక్క ఆధారిత ప్రోటీన్, నెమ్మదిగా జీర్ణమయ్యే కార్బోహైడ్రేట్స్‌కు మంచి మూలం. ఫైబర్ ఇన్సులిన్ సెన్సిటివిటీని మెరుగుపరచి గట్ మైక్రోబయోమ్‌ను (మంచి బ్యాక్టీరియా) బలోపేతం చేస్తుంది. ఇది ఫ్యాటీ లివర్ నియంత్రణకు ఉపయోగపడుతుంది. వీటితో పాటు బీట్‌రూట్ ను తీసుకోవడం ద్వారా కూడా ఈ సమస్య నుండి సులభంగా బయటపడవచ్చు. బీట్‌రూట్‌లో ఫైబర్, నైట్రేట్స్, బెటలైన్స్ అనే యాంటీ ఆక్సిడెంట్లు ఉంటాయి. ఇవి లివర్ పనితీరును మెరుగుపరచడంలో, ఆక్సీకరణ ఒత్తిడిని తగ్గించడంలో సహాయపడతాయి. ఈ విధంగా చిన్న చిన్న ఆహారపు మార్పులు రోజువారీ జీవనశైలిలో చేర్చుకుంటే కాలేయ ఆరోగ్యం మెరుగుపడుతుంది. ఫ్యాటీ లివర్ సమస్యను తగ్గించుకోవచ్చు.

# చర్మం యవ్వనంగా ఉండాలని వీటిని తీసుకుంటున్నారా.. అయితే జాగ్రత్త..

ఇటీవలి కాలంలో కొల్లాజెన్ సప్లిమెంట్లు చాలా ప్రాచుర్యం పొందాయని చెప్పవచ్చు. మెరిసే చర్మం, బలమైన జుట్టు, గోర్లు, కీళ్ల ఆరోగ్యం కోసం వీటిని చాలా మంది ఉపయోగిస్తున్నారు. కానీ కొల్లాజెన్ పౌడర్లు, డ్రింక్స్ లేదా క్యాప్సూల్స్ వాడే ముందు వాటి ప్రయోజనాలు, ప్రమాదాల గురించి తెలుసుకోవడం కూడా చాలా ముఖ్యమని నిపుణులు చెబుతున్నారు. కొల్లాజెన్ అనే ప్రోటీన్ ను శరీరం సహజంగా ఉత్పత్తి చేస్తుంది. ఇది చర్మం, ఎముకలు, టెండన్స్, కార్టిలేజ్ నిర్మాణాన్ని కాపాడడంలో కీలక పాత్ర పోషిస్తుంది. అయితే కొల్లాజెన్ సప్లిమెంట్లు తీసుకునే ముందు కొన్ని ప్రమాదాలను కూడా పరిగణనలోకి తీసుకోవాలని తాజా అధ్యయనాలు చెబుతున్నాయి. మెరైన్ కొల్లాజెన్ (చేపల నుండి పొందేది) తరచుగా చేపల వాసన లేదా రుచి కలిగి ఉంటుంది. ఇది చాలా మందికి ఇష్టం లేకపోవచ్చు. అలాగే కొందరికి అలర్జీ రియాక్షన్లు కూడా కలగవచ్చు.

### జీర్ణ సమస్యలు, చర్మ సమస్యలు వచ్చే అవకాశం..

వయస్సు పెరిగే కొద్దీ సహజ కొల్లాజెన్ ఉత్పత్తి తగ్గుతుంది. దీనివల్ల ముడతలు, కీళ్ల నొప్పి, చర్మం వదులుగా అవ్వడం జరుగుతుంది. అందుకే చాలా మంది కొల్లాజెన్ సప్లిమెంట్లను ఉపయోగిస్తూ ఉంటారు. కానీ ఇవి పూర్తిగా సురక్షితమైనవి కావని నిపుణులు చెబుతున్నారు. కొల్లాజెన్ సప్లిమెంట్లను ఉపయోగించడం ద్వారా కొన్ని సమస్యలు కూడా కలుగుతాయని వారు చెబుతున్నారు. కొల్లాజెన్ సప్లిమెంట్లు తీసుకున్న తర్వాత కొందరికి కడుపు ఉబ్బరం, కడుపు నిండుగా అనిపించడం, హార్ట్‌బర్న్, వాంతులు వంటి సమస్యలు రావచ్చు. ఇవి సాధారణంగా తేలికపాటి సమస్యలే అయినప్పటికీ అసౌకర్యంగా ఉంటాయి. ఎక్కువ మోతాదులో తీసుకుంటే ఈ సమస్యలు మరింత ఎక్కువగా కనిపించవచ్చు. కొల్లాజెన్ ఉత్పత్తులు కొందరిలో అలర్జీలను కూడా కలిగిస్తాయి.

జాతీయ దిన పత్రిక
తరంగాలు
THARANGALU DAILY NEWS
సోమవారం, 27 జూలై, 2026


# కిరణ్ అబ్బవరం క్లాసిక్ హిట్ కొట్టాడా?

కిరణ్ అబ్బవరం 'చెన్నై లవ్‌స్టోరీ' ఫస్ట్ గ్లింప్స్ నుంచే సినిమాపై ఆసక్తిని పెంచించింది. తొలిప్రేమ గురించి చెప్పే సంభాషణలు ఉత్సాహాన్ని పెంచాయి. 'కలర్ ఫోటో', 'బేబీ' చిత్రాలతో గుర్తింపు తెచ్చుకున్న దర్శకుడు సాయి రాజేశ్ ఈ చిత్రానికి కథ ఇవ్వడం, ఈ సినిమా క్లాసిక్ అవుతుందనే కోణంలో చేసిన ప్రచారం... ఇవన్నీ సినిమాపై అంచనాలు పెంచాయి. మరి ఆ అంచనాలను ఈ సినిమా అందుకుందా? ఈ ప్రేమకథలో ఉన్న కొత్తదనం ఏమిటి? రివ్యూలో చూద్దాం.



### కథ గురించి:

ప్రేమించిన వ్యక్తి పెళ్లి మండపంలోనే మోసం చేయడంతో నివి (శ్రీ గౌరీ ప్రియ) కుంగిపోతుంది. అలాంటి సమయంలో ఆమె జీవితంలోకి అడుగుపెట్టిన స్టీవెన్ శంకర్ (కిరణ్ అబ్బవరం) మళ్లీ ప్రేమ, జీవితంపై ఆశలు చిగురించేలా చేస్తాడు. ఈ ఇద్దరి స్నేహం ప్రేమగా మారుతుంది. కానీ విధి ఈ ప్రేమకథను ఊహించని మలుపు తిప్పుతుంది. ఏమిటా మలుపు? ఈ కథకు ఎలాంటి ముగింపు దొరికిందన్నదే 'చెన్నై లవ్ స్టోరీ' కథ.

### విశ్లేషణ:

ప్రేమకు ఫాంటసీ జోడించిన కథ ఇది. ప్రేమలో విఫలమై దేవదాసులా మారిన కథానాయిక కోణంలో కథను ప్రారంభించడం తొలి సగానికి కొత్తదనాన్ని తీసుకొచ్చింది. స్టీవెన్ శంకర్ నివి జీవితంలోకి అడుగుపెట్టిన తర్వాత ఇద్దరి మధ్య పెరిగే అనుబంధం, ప్రేమ సహజంగా



ఆకట్టుకుంటాయి. ఇంటర్వెల్ ట్విస్ట్ సినిమాపై అంచనాలను మరింత పెంచుతుంది. ద్వితీయార్ధంలో దర్శకుడు కథను పూర్తిగా ఫాంటసీ వైపు మళ్లిస్తాడు. అది ఇదివరకే వచ్చిన 'ఎందుకంటే... ప్రేమంట!' సినిమాను గుర్తు చేసినా, 'చెన్నై లవ్‌స్టోరీ' ఆత్మ వేరు. హీరో పాత్రలో వచ్చే జెలసీ కావాల్సిన వినోదాన్ని పంచుతుంది. ప్రీక్లైమాక్స్, క్లైమాక్స్‌లో వచ్చే ఎమోషన్స్ హత్తుకునేలా ఉంటాయి. ప్రేమ విషయంలో రెండు పాత్రల మధ్య కాస్త గందరగోళం ఏర్పడినప్పటికీ, ఈ సినిమాకు దర్శకుడు ఇచ్చిన క్లైమాక్స్ హత్తుకునేలా ఉంటుంది.

### నటన గురించి:

స్టీవెన్ శంకర్ పాత్రలో కిరణ్ అబ్బవరం చూపించే అమాయకత్వం, చలాకీతనం సహజంగా ఉంటాయి. చాలా ఎమోషన్ ఉన్న పాత్ర ఇది. దర్శకుడు కావాలనే తన కల, అలాగే నివితో ప్రేమ, తను అనాథ అనే భావం.. ఇవన్నీ సహజంగా పలికించాడు. నివి పాత్రలో శ్రీగౌరీ ప్రియ ఈ సినిమాకు మరో ప్రధాన బలంగా నిలిచింది. ఆమె నటన చాలా హుందాగా ఉంది. ఈ జోడీ తెరపై అందంగా కనిపించింది. త్రిగుణ్ తన కీలకమైన పాత్రకు న్యాయం చేయగా, మిగతా నటీనటులు తమ పాత్రల పరిధిలో మెప్పించారు.

### టెక్నికల్‌గా:

దర్శకుడు రవి నంబూరి సాయి రాజేశ్ కథలోని భావోద్వేగాలను తెరపై చక్కగా ఆవిష్కరించారు. సాంకేతికంగా మణిశర్మ సంగీతం సినిమాకు ప్రాణం పోశాయి. 'గుర్తుందా', 'వదలనే' పాటలు చక్కగా కుదిరాయి. విశ్వాస్ డేనియల్ ఛాయాగ్రహణం, చెన్నై వాతావరణం, వర్షం, కొన్ని క్లాసిక్ సినిమాలని గుర్తు చేసే ఫ్రేమ్స్, ఉన్నతమైన నిర్మాణ విలువలు సినిమాకు మరింత అందాన్ని తీసుకొచ్చాయి.

# విజయ్ 'జననాయగన్'గా మెప్పించాడా..?

పురుటి నొప్పులను అనుభవించి, ఒడిదుడుకులను అధిగమించి ఎట్టకేలకు విజయ్ 'జననాయగన్' చిత్రం గురువారం విడుదలైంది. రాజకీయ పార్టీ స్థాపించి, నటుడిగా ఇది తన చివరి సినిమా అని విజయ్ ప్రకటించిన నాటినుంచే ఈ సినిమాపై అంచనాలు తారాస్థాయికి చేరాయి. తాను ప్రచారంలో ఉండగానే ఈ సినిమా పూర్తయి, విడుదలకు సిద్ధమైంది. కానీ పలు రాజకీయ కారణాల వల్ల సినిమా విడుదలకు అడ్డంకులు ఎదురయ్యాయి.సినిమా సమీక్షలు
ఇవిగాక, తమిళనాట ఈ సినిమా పైరసీకి గురవ్వడం, సెన్సార్ కష్టాలు.. వీటన్నింటి మధ్య, అసలు 'జననాయగన్' విడుదల అవుతుందా? అని అంతా భావించిన తరుణంలో తమిళనాడు ఎన్నికల్లో విజయ్ ఘన విజయం సాధించి, ముఖ్యమంత్రి పీఠాన్ని అధిష్టించారు. దాంతో ఈ సినిమాపై అంచనాలు మరింత పెరిగాయి. తెలుగులో బాలకృష్ణ నటించిన 'భగవంత్ కేసరి' రీమేక్ అనడంతో తెలుగునాట కూడా ఈ సినిమాపై ఆసక్తి నెలకొన్నది. మరి అందరి అంచనాలనూ 'జననాయగన్' నిజం చేశాడా? లేదా? తెలుసుకోవాలంటే.. అసలు కథలోకి వెళ్లాలి.



### కథ...

దుర్మార్గుడైన పొలిటికల్ లీడర్ రోజా(ప్రకాశ్‌రాజ్) చేసే దుర్మార్గాలకు ఎదురు నిలుస్తాడు పోలీస్ అధికారి అమ్రేష్ పూజారి(బాబీ డియోల్). దాంతో అమ్రేష్ పూజారిని వేలాదిమంది ముందు తీవ్రంగా అవమానిస్తాడు రోజా. అవమానభారంతో ఆత్మహత్యకు పాల్పడబోయిన అమ్రేష్ పూజారిని తన అంతరాత్మే ప్రశ్నిస్తుంది. నీతికీ నిజాయితీకి సమాజంలో విలువ లేదని, అసలుసిసలైన నీచత్వం ప్రజల్లోనే ఉందని, ప్రజాక్షేమం కోసం పాటుపడటం అమాయకత్వమేనని, కుల మత ప్రాంతీయ విబేధాలతో మలినమైనపోయిన ఈ జనం కోసం, డబ్బు, మద్యానికి బానిసలుగా బతుకుతున్న ఈ జనం కోసం నువ్వెందుకు పాటుపడాలని తన అంతరాత్మ ప్రశ్నించడంతో, నీతికీ నిజాయితీకి మారుపేరైన అమ్రేష్ పూజారీ నీచుడిగా మారతాడు. జనంపై పగబడతాడు. చెడ్డదారిలో వెళ్లి దేశాన్నే నాశనం చేయాలనుకుంటాడు. ఈ ప్రయత్నంలో తాను అంతర్జాతీయంగా ఎదుగుతాడు. ప్రపంచదేశాలకే ప్రశ్నార్థకంగా మారతాడు. ఇండియాను కూడా నాశనం చేయాలనే అతని ప్రయత్నాన్ని వెట్రీ(విజయ్) అడ్డుకుంటాడు. అసలు ఎవరీ వెట్రి? వెట్రికీ, అమ్రేష్ పూజారీకీ మధ్య ఉన్న సంబంధం ఏంటి? అమ్రేష్‌పూజారి దుర్మార్గాన్ని వెట్రి ఎలా అడ్డుకున్నాడు? దేశాన్ని ఎలా కాపాడాడు?అనేది మిగతా కథ.

### విశ్లేషణ..

ఈ సినిమా స్ట్రెచర్ అంతా బాలకృష్ణ 'భగవంత్ కేసరి' సినిమానే. ఆ కథకు అమ్రేష్ పూజారీ అనే అంతర్జాతీయ క్రిమినల్ క్యారెక్టర్‌ని యాడ్ చేసి దర్శకుడు హెచ్.వినోద్ ఈ సినిమాను తెరకెక్కించారు. అమ్రేష్ పూజారీ ఎపిసోడ్‌ని మినహాయిస్తే మిగతా కథంతా 'భగవంత్ కేసరి' సినిమానే. విజయ్ రాజకీయ జీవితానికి ఉపయోగపడేలా కొన్ని సీన్స్‌ని ప్రత్యేకంగా రాసుకున్నారు హెచ్.వినోద్. 'భగవంత్ కేసరి'లో ఉన్న గర్ల్ ఎంపవర్‌మెంట్ కాన్సెప్ట్‌ని ఇంకాస్త డెవలప్ చేసి, కొన్ని యాక్షన్ సన్నివేశాలను మిళితం చేసి ఈ సినిమా చేశారు. బాలకృష్ణ, శ్రీలీల పాత్రల్ని యాజిటీజ్‌గా దించేశారు. బాలకృష్ణ పోషించిన భగవంత్ కేసరి పాత్ర తమిళంలో వెట్రి అయితే.. శ్రీలీల పోషించిన విజ్జి పాప పాత్రను మమితాబైజు పోషించింది. వీరిద్దరికీ సంబంధించి దాదాపుగా 'భగవంత్ కేసరి'లో ఉన్న సన్నివేశాలే ఈ సినిమాలోనూ కనిపిస్తాయి. తన మంచి కోసం ఆలోచించిన పోలీస్ అధికారి ప్రమాదవశత్తూ చనిపోతూ, తన కూతురుని వెట్రి చేతిలో పెట్టి చనిపోవడం. ఆ పాపను ఆర్మీలో చేర్పించాలనే ఆ తండ్రి జీవితాశయాన్ని నిజం చేసేందుకు వెట్రి అహరహం శ్రమించడం.. ఆ పాపను కంటికి రెప్పలా కాపాడటం.. ఇదంతా 'భగవంత్ కేసరి' సినిమానే. మరీ కొన్ని సన్నివేశాలనైతే దర్శకుడు హెచ్.వినోద్ తెలుగు వెర్షన్‌లోంచి ఎత్తి పెట్టాడు. ప్రథమార్ధం అయితే.. 'భగవంత్ కేసరి' సినిమా చూస్తున్నట్టే ఉంది. ద్వితీయార్ధం కథ కొత్త పుంతలు తొక్కింది. కొత్త సమస్యను చూపించాడు. అద్భుతమైన యాక్షన్ సన్నివేశాలను రాసుకున్నాడు. విజయ్ కోసం ప్రత్యేకమైన ఎలివేషన్స్‌ని డిజైన్ చేశాడు. తమిళనాడుకు ఎమ్జీయార్ తర్వాత విజయే అన్నట్టు కొన్ని సన్నివేశాలను ప్రమోట్ చేశారు.

### ఎవరెవరు ఎలా చేశారు..?

వెట్రిగా విజయ్ బాగా చేశాడు. తనదైన స్టైల్‌లో ఫ్యాన్స్‌ని ఆకట్టుకున్నాడు. ముఖ్యంగా తమిళనాట విజయ్ నటనకు విజిల్స్ పడటం ఖాయం. తెలుగులో కాజల్ చేసిన పాత్రనే పూజా హెగ్డే చేసింది. ఉన్నంతలో బాగా చేసింది. ఇక మమితాబైసు విజ్జిపాపగా ఆకట్టుకుంది. బాబీ డియోల్ ఎప్పటిలాగే అద్భుతమైన విలనీ పలికించారు. ఇక ప్రకాశ్‌రాజ్ తనదైన శైలి నటనతో మెప్పించారు. మిగతా వారంతా పరిధిమేర రక్తికట్టించారు.

### సాంకేతికంగా..

'భగవంత్ కేసరి'కథను ప్రేరణగా తీసుకున్నా.. అందులోని భావోద్వేగాలను ఆ స్థాయిలెట ఈసినిమా క్యారీ కాలేదనే చెప్పాలి. కానీ మాస్ ప్రేక్షకులకు, ముఖ్యంగా విజయ్ అభిమానులకు నచ్చేలా దర్శకుడు హెచ్.వినోద్ ఈ సినిమాను మలిచాడు. సెకండాఫ్ చూపించిన కొత్త కథ ప్రేక్షకులకు నచ్చుతుంది. నేపథ్య సంగీతంతో అనిరుథ్ రవిచంద్రన్ ఆకట్టుకున్నారు. కెమెరా, ఎడిటింగ్ పనితీరు కూడా బావుంది. మొత్తంగా సాంకేతికంగా సినిమా అభినందనీయంగా ఉంది.

# టాక్సిస్ నుంచి మనసాగదే..పాట విడుదల

యశ్ కథానాయకుడిగా నటిస్తున్న యాక్షన్ థ్రిల్లర్ 'టాక్సిక్' గీతూ మోహన్ దాస్ దర్శకత్వం వహిస్తున్నారు. ఇప్పటికే చిత్రీకరణ పూర్తి చేసుకున్న ఈ మూవీ ఆగస్టు 26న పాన్ ఇండియా స్థాయిలో విడుదల కానుంది. చిత్ర ప్రచారంలో భాగంగా 'మనసాగదే.. ' అంటూ సాగే పాటను చిత్ర బృందం తాజాగా విడుదల చేసింది. తనిష్ బాగ్చీ, అర్సాన్ నిజామి, ఫహీమ్ అబ్దుల్లా స్వరాలు సమకూర్చిన ఈ పాటకు రామ జోగయ్యశాస్త్రి సాహిత్యం అందించారు. సిద్దార్థ్ బస్రూర్ ఆలపించారు. యశ్‌తో (జజీబర) పాటు, నయనతార, కియారా అద్వాణీ, హ్యూమా ఖురేషి, తారా సుతారియా, రుక్మిణి వసంత్‌లు ఈ మూవీలో నటిస్తున్నారు ఓ సరికొత్త యాక్షన్ డ్రామాగా గీతూ మోహన్ దీన్ని తీర్చిదిద్దుతున్నట్లు అర్థమవుతోంది.




## ప్రశాంతమైన రక్తపాతం



'కేజీఎఫ్' ఫేం యశ్ కథానాయకుడిగా గీతూ మోహన్‌దాస్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న అత్యంత ప్రతిష్టాత్మక పాన్‌ఇండియా యాక్షన్ ఎంటర్‌టైనర్ 'టాక్సిక్'. ఆగస్ట్ 26న ప్రపంచవ్యాప్తంగా ఈ సినిమా విడుదల కానున్నది. ఈ సందర్భంగా మరో కొత్త పోస్టర్‌ని మేకర్స్ ఆదివారం విడుదల చేశారు. ప్రశాంతంగా సిగరెట్ వెలిగిస్తున్న యశ్‌ని ఈ పోస్టర్‌లో చూడొచ్చు. యశ్ చేతులు చిక్కటి రక్తంతో తడిసి ఉండటం, వేళ్ల నుంచి రక్తపు చుక్కలు జారుతూ కనిపించడం చూస్తే, ఇదొక టెర్రిఫిక్ యాక్షన్ సీన్‌కి సంబంధించిన స్టిల్ అని అర్థమవుతున్నది. ఫియర్, మిస్టరీ, స్టైల్ మేళవింపైన ఈ పోస్టర్ సినిమాపై ఆసక్తిని మరింత పెంచుతుందని మేకర్స్ చెబుతున్నారు. కేవీఎన్ ప్రొడక్షన్స్, మాస్టర్ మైండ్ క్రియేషన్స్ కలిసి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్న విషయం తెలిసిందే.

## రామ్‌చరణ్‌కు సర్జరీ



అగ్ర కథానాయకుడు రామ్‌చరణ్ మణికట్టు సర్జరీ నిమిత్తం కోయంబత్తూరు పయనమయ్యారు. అక్కడి గంగా ఆసుపత్రిలో ఆయనకు సర్జరీ జరుగనున్నది. ప్రత్యేక వైద్య నిపుణులు ఈ సర్జరీని నిర్వహించనున్నారు. 'పెద్ది' సినిమా షూట్‌లో రామ్ చరణ్ మణికట్టుకు గాయమైన విషయం తెలిసిందే.అయినప్పటికీ ఆ సినిమా ప్రచార కార్యక్రమాల్లో ధాటిగా పాల్గొన్నారాయన. సర్జరీ సమయంలో రామ్‌చరణ్‌కు తోడుగా ఆయన సతీమణి ఉపాసనతోపాటు తల్లిదండ్రులు సురేఖ, చిరంజీవి కూడా కోయంబత్తూరు వెళ్లినట్టు సమాచారం.

## పారితోషికంగా 20కోట్లు?



ఇండియన్ ఫిల్మ్ ఇండస్ట్రీలోని టాప్ 5 హీరోయిన్లలో సాయిపల్లవి కచ్చితంగా ఉంటారు. ఇప్పటి వరకూ సాయిపల్లవి రిజక్ట్ చేసిన సినిమాలు ఉన్నాయి గానీ, సాయిపల్లవిని రిజక్ట్ చేసిన సినిమాలు లేవు. దటీజ్ సాయిపల్లవి. ఆమెను మెప్పించాలంటే ముందు మంచి కథతో వెళ్లాలనేది దేశవ్యాప్తంగా ఉన్న దర్శకనిర్మాతల మాట. కథకు, పాత్రకూ తొలిప్రాధాన్యతనిచ్చే సాయిపల్లవి.. అసలు పారితోషికం ఎంత తీసుకుంటుంది? అనేది మాత్రం చాలామందికి తెలీదు. కానీ ప్రస్తుతం బీటౌన్ సమాచారం ప్రకారం నితేష్ తివారీ దర్శకత్వంలో ఆమె నటిస్తున్న 'రామాయణ' చిత్రానికి రెండు భాగాలకు గాను రూ.20 కోట్లను ఆమె రెమ్యునరేషన్‌గా అందుకుంటున్నదని తెలిసింది. అంటే సినిమా పదికోట్లన్నమాట. ఈ స్థాయి పారితోషికం అందుకునే తారలు ఇండియాలో అరుదు.


## న్యూటన్స్ థర్డ్ లా ఓ పెద్ద సర్‌ప్రైజ్



'అనగనగా' విజయం తర్వాత ఈటీవీ విన్ సంస్థలో సుమంత్ చేసిన సినిమా 'న్యూటన్స్ థర్డ్ లా'. రాజేశ్ కర్ణ దర్శకుడు. కె.హరీశ్ నిర్మాత. ఈ నెల 31న సినిమా థియేటర్ల విడుదల కానున్నది. ఈ సందర్భంగా ఈ సినిమా ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌ని హైదరాబాద్‌లో నిర్వహించారు. హీరో అడివి శేష్ ఈ కార్యక్రమానికి అతిథిగా పాల్గొని చిత్ర బృందానికి శుభాకాంక్షలు అందించారు. సుమంత్ మాట్లాడుతూ "మళ్లీ రావా' తర్వాత సింగిల్ సిట్టింగ్‌తో ఓకే చేసిన కథ 'న్యూటన్స్ థర్డ్ లా'. ఇందులో ప్రతి పాత్రకూ ప్రాధాన్యత ఉంటుంది. ఇది థ్రిల్లరే అయినా.. సెంట్రల్ డ్రామా ఫ్యామిలీ చుట్టూనే ఉంటుంది. థియేటర్లలో ఆడియన్స్‌కి పెద్ద సర్‌ప్రైజ్ ఈ సినిమా' అని నమ్మకంగా చెప్పారు. ఆడియన్స్‌కి హయ్యస్ట్ కిక్‌ని ఇచ్చే సినిమా ఇదని, ఇంటర్వెల్‌కే ఆడియన్‌కి పైసా వసూల్ ఫీల్ వస్తుందని, క్లైమాక్స్ మైండ్ బ్లోయింగ్‌గా ఉంటుందని దర్శకుడు రాజేశ్ కర్ణ చెప్పారు. ఇంకా ఈటీవీ విన్ ప్రతినిధులు సాయికృష్ణ, భరణ్, నటి నేహా, నిర్మాత హరీశ్, సంగీత దర్శకుడు సింజిత్, నటులు త్రినాథ్, రవివర్మ కూడా మాట్లాడారు.

జాతీయ దిన పత్రిక
తరంగాలు
THARANGALU DAILY NEWS
సోమవారం, 27 జూలై, 2026


## మీరాబాయి చాను హ్యాట్రిక్.. దేశానికి తొలి స్వర్ణం అందించిన వెయిట్‌లిఫ్టర్..!



గ్లాస్గో వేదికగా జరుగుతున్న కామన్వెల్త్ గేమ్స్‌లో భారత వెయిట్‌లిఫ్టర్ మీరాబాయి చాను దేశానికి తొలి స్వర్ణం అందించింది. ఆదివారం జరిగిన మహిళల 48 కిలోల విభాగంలో సత్తా చాటిన మీరాబాయి అగ్రస్థానంలో పసిడి వెలుగులు విరజిమ్మిం ది. ఆసియా క్రీడలే తన అసలైన లక్ష్యమని, కామన్వెల్త్‌లో వందశాతం ప్రయత్నిస్తానో లేదోనని చెప్పిన ఆమె అందరి అంచనాలు అందుకుంటూ ఈ టోర్నీలో వరసగా మూడోసారి గోల్డ్‌మెడల్‌తో మురిసిపోయింది.కామన్‌వెల్త్ క్రీడల్లో వెయిట్‌లిఫ్టర్ మీరాబాయి చాను తన ఆధిపత్యాన్ని కొనసాగించింది. 2018, 2022లో పసిడి పతకం కొల్లగొట్టిన మీరాబాయి గ్లాస్గోలోనూ పట్టువదల్లేదు. ఫైనల్లో బరువులు ఎత్తిన భారత స్టార్ ఈ ఎడిషన్‌లో దేశానికి తొలి స్వర్ణం అందించింది.

ఇదివరకు 82 కిలోలతో కామన్వెల్త్‌లో రికార్డు నెలకొల్పిన మీరాబాయి..క్లీన్ అండ్ జెర్క్ విభాగంలో తొలి ప్రయత్నంలో విఫలమైంది. రెండోసారి తడబడకుండా 82 కిలోలు, మూడో ప్రయత్నంలో 85 కిలోలు ఎత్తి సరికొత్త రికార్డు సాధించింది. అనంతరం 105 కిలోలను సైతం అవలీలగా ఎత్తిన మీరాబాయి పసిడి పతకంతో మువ్వన్నెల జెండాను రెపరెపలాడించింది. తద్వారా భారత్ పతకాల సంఖ్య మూడుకు చేరింది.

**రిషికాంత సింగ్**




మీరా కంటే ముందు వెయిట్‌లిఫ్టింగ్‌లోనే చనంబమ్ రిషికాంత సింగ్ రజతంతో మెరిశాడు. పురుషుల 60 కిలోల విభాగంలో సత్తా చాటిన అతడు రెండోస్థానంతో సరిపెట్టు కున్నాడు. కామన్వెల్డ్ రికార్డు నెలకొల్పిన రిషికాంత సింగ్ పసిడి వేటలో వెనకబడి.. వెండి వెలుగులు విరజిమ్మాడు. మలేషియా వెయిట్‌లిఫ్టర్ మొహమద్ అనిక్ బిన్ కస్దాన్ స్వర్ణం ఎగరేసుకుపోయాడు. రిషికాంత్, మొహమూద్‌లు.. ఇద్దరూ విజయవంతంగా 121 కిలోలు ఎత్తడం ఈ క్రీడల చరిత్రలో ఇదే మొదటిసారి.

## టీ20ల్లో తొలి బంతికే వికెట్.. భారత రెండో పేసర్‌గా మయాంక్..!




అంతర్జాతీయ టీ20ల్లో భారత యువ పేసర్ మయాంక్ యాదవ్ అరుదైన ఫీట్ సాధించాడు. దాదాపు రెండేళ్ల విరామం తర్వాత జట్టులోకి వచ్చిన మయాంక్.. జింబాబ్వే పర్యటనలో తొలి బంతికే వికెట్ తీసి రికార్డు నెలకొల్పాడు. 150 కిలోమీటర్ల వేగంతో బౌలింగ్ చేసే మయాంక్.. ఇలా మొదటి బంతికే వికెట్ తీయడం ఇది మూడోసారి. తద్వారా వెటరన్ పేసర్ భువనేశ్వర్ కుమార్ సరసన నిలిచాడీ యువ స్పీడ్‌స్టర్. ఐపీఎల్‌లో సూపర్ ఫాస్ట్ బౌలింగ్‌తో బ్యాటర్లను భయపెట్టిన మయాంక్ యాదవ్ జింబాబ్వే పర్యటనలో చెలరేగుతున్నాడు. మూడో టీ20లో తొలి బంతికే ఓపెనర్ బ్రియాన్ బెన్నెట్‌ను ఔట్ చేసిన మయాంక్ అంతర్జాతీయంగా మూడోసారి ఈ ఫీట్ సాధించాడు. దాంతో, పొట్టి ఫార్మాట్‌లో మూడు పర్యాయాలు మొదటి బంతికే వికెట్ తీసిన భారత రెండో పేసర్‌గా మయాంక్ రికార్డు పట్టేశాడు. మయాంక్ కంటే ముందు భువనేశ్వర్ కుమార్ మూడుసార్లు ఫస్ట్ బాల్‌కే వికెట్ పడగొట్టాడు. ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా, అర్ష్‌దీప్ సింగ్‌లు రెండుసార్లు, మాజీ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్‌లు ఒకసారి మాత్రమే తొలి బంతికే వికెట్ తీశారు.

మయాంక్ 2024లో బంగ్లాదేశ్‌తో హైదరాబాద్‌లో జరిగిన టీ20లో ఓపెనర్ పర్వేజ్ హొసేన్‌ను తొలిబంతికే ఔట్ చేశాడు. దాదాపు రెండేళ్ల విరామం తర్వాత జింబాబ్వే పర్యటనకు ఎంపికైన అతడు.. రెండు మ్యాచుల్లో ఓపెనర్ బ్రియన్ బెన్నెట్‌ను మొదటి బంతికే ఔట్ చేసి ఈ రికార్డు సొంతం చేసుకున్నాడు.

# సిరీస్ టీమిండియా కైవసం..!

## వైభవ్, మయాంక్ ధాటికి చేతులెత్తేసిన జింబాబ్వే..



వరసగా రెండు సిరీస్‌లలో క్లీన్‌స్వీప్‌కు గురైన భారత జట్టు పంజా విసిరింది. ఛాంపియన్ ఆటతో దుమ్మురేపి జింబాబ్వేను వైట్‌వాష్ చేసి తామేంటో నిరూపించింది. నామమాత్రమైన మూడో టీ20లో వైభవ్ సూర్యవంశీ(81) పిడుగల్లే విరుచుకు పడగా.. బంతితో మయాంక్ యాదవ్(3-29) ఆతిథ్య జట్టును దెబ్బకొట్టాడు. టాపార్డర్ వైఫల్యంతో ఏదిశలోనూ లక్ష్యం దిశగా సాగని జింబాబ్వే రియాన్ బర్ల్(54 నాటౌట్)అర్ధశతకంతో రాణించగా ఆలౌట్ ప్రమాదం తప్పించుకున్నా హ్యాట్రిక్ ఓటమితో సిరీస్ సమర్పించుకుంది. టీ20 ఫార్మాట్లో మళ్లీ జోరందుకున్న భారత జట్టు 3-0తో జింబాబ్వేపై సిరీస్ గెలుపొందింది. వరసగా రెండు మ్యాచుల్లో విజయంతో క్లీన్‌స్వీప్‌పై కన్నేసిన టీమిండియా టాప్ గేర్‌లో ఆడి ఆతిథ్య జట్టును చిత్తు చేసింది. హరారే స్పోర్ట్స్ క్లబ్‌లో తొలుత వైభవ్ సూర్యవంశీ(81) తుఫాన్ ఇన్నింగ్స్‌తో భయపెట్టగా.. అనంతరం బంతితో మయాంక్ యాదవ్(3-29) వణికించాడు. టాపార్డర్ కుప్పకూలడంతో పవర్ ప్లేలోనే ఓటమి అంచున నిలిచిన జింబాబ్వే 157కే పరిమితమైంది. దాంతో, ఐర్లాండ్, ఇంగ్లండ్ చేతిలో ఓటములతో విమర్శలపాలైన శ్రేయాస్ అయ్యర్ కెప్టెన్‌గా మొట్టమొదటి సిరీస్ గెలిచి నవ్వు ముఖం పెట్టాడు.



### తొలి బంతికే

భారీ ఛేదనలో మయాంక్ యాదవ్(3-29) తొలి బంతికే ఓపెనర్ బ్రియాన్ బెన్నెట్(0)ను వెనక్కి పంపాడు. ఆచితూచి ఆడుతున్న డియాన్ మోయర్స్(19), సికిందర్ రజా(0) లను యశ్ ఠాకూర్ ఒకే ఓవర్లో ఔట్ చేశాడు. ఈ ఇద్దరిని వరస బంతుల్లో పెవిలియన్ చేర్చిన యశ్ హ్యాట్రిక్‌పై నిలిచాడు. కానీ, రియాన్ బర్ల్(54 నాటౌట్) వస్తూనే బౌండరీ సాధించాడు. బర్ల్‌తో వికెట్ కాచుకున్న బెన్ కరాన్(20)ను బిష్ణోయ్ బోల్తా కొట్టించగా ఆతిథ్య జట్టు పీకల్లోతు కష్టాల్లో పడింది. ఓవైపు వికెట్లు పడుతున్నా మధ్వేరా(28)తో కలిసి ఒంటరిపోరాటం చేసిన బర్ల్ అర్ధశతకంతో అజేయంగా నిలిచాడు. జింబాబ్వే 157కే పరిమితవ్వడంతో 35 పరుగుల తేడాతో టీమిండియా విక్టరీ కొట్టింది.

### వైభవ్ మళ్లీ దంచేయగా

టాస్ గెలిచిన బ్యాటింగ్ తీసుకున్న భారత జట్టుకు శుభారంభ దక్కలేదు. ఓపెనర్ అభిషేక్ శర్మ(2) మరోసారి ముజరబని ఓవర్లో వెనుదిరగగా.. వైభవ్ సూర్యవంశీ(81), ఇషాన్ కిషన్(29) కీలక భాగస్వామ్యం నిర్మించారు. పవర్ ప్లేలో వికెట్ నష్టానికి 64 రన్స్ చేసింది. జింబాబ్వే బౌలర్లపై అటాకింగ్ గేమ్‌తో విరుచుకుపడిన ఆడిన ఈ ద్వయం హాఫ్ సెంచరీ భాగస్వామ్యం నెలకొల్పింది. ఈ క్రమంలోనే వైభవ్ అంతర్జాతీయ టీ20ల్లో రెండో అర్ధ శతకం సాధించాడు.
వైభవ్ సూర్యవంశీ(81)
సికిందర్ రజా ఓవర్లో ఇషాన్ బౌల్డయ్యాక.. కెప్టెన్ శ్రేయాస్ అయ్యర్(27)తో కలిసి చెలరేగాడు వైభవ్. సిక్సర్లతో చెలరేగుతూ శతకానికి చేరువైన అతడిని మధ్వేరె పెవిలియన్ చేర్చగా జింబాబ్వే బౌలర్లు ఊపిరి పీల్చుకున్నారు. అనంతరం తిలక్ వర్మ(11 నాటౌట్) జతగా గేర్ మార్చాలనుకున్న అయ్యర్‌నుఎవాన్స్ బోల్తా కొట్టించాడు. రింకూ సింగ్(25) రెడు ఫోర్లు, ఒక సిక్సర్‌తో మెరవగా టీమిండియా నిర్ణీత ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 192 పరుగులు చేసింది.

## హాకీ వరల్డ్‌కప్‌నకు భారత జట్టు ప్రకటన

2026 హాకీ ప్రపంచకప్ టోర్నమెంట్‌కు హాకీ ఇండియా భారత జట్టు ను మంగళవారం ప్రకటించింది. 20 మంది సభ్యులతో కూడిన జట్టుకు హర్మన్‌ప్రీత్ సింగ్ కెప్టెన్‌గా వ్యవహరించనున్నారు. ఈ ప్రతిష్ఠాత్మక టోర్నమెంట్ వచ్చే నెల 15న ప్రారంభం కానుంది. ఈ మ్యాచ్‌లకు నెదర్లాండ్స్, బెల్జియం సంయుక్తంగా ఆతిథ్యం ఇవ్వనున్నాయి. ఈ టోర్నీలో భారత్ పూల్ డీలో ఉంది. ఈ గ్రూప్?లో భారత్‌తోపాటు ఇంగ్లాండ్, పాకిస్థాన్, వేల్స్ జట్లు ఉన్నాయి. పురుషుల టోర్నీలో 16 జట్లు పోటీలో ఉన్నాయి. నాలుగేసి జట్లను నాలుగు గ్రూపులుగా విభజించారు. ప్రపంచ కప్ జట్టు ఎంపికపై టీమ్ హెడ్ కోచ్ ఫుల్టన్ మాట్లాడారు. 'ఇది చాలా సమతుల్యమైన జట్టు. ఇందులో అనుభవం ఉన్న ఆటగాళ్లు ఉన్నారు. అలాగే అద్భుతమైన ఫామ్‌లో ఉన్న యువ ఆటగాళ్లూ ఉన్నారు. ఈ ఇద్దరితో టీమ్ బ్యాలెన్స్?గా ఉంది. భారత్ ప్రపంచ కప్ గెలిచి 50 ఏళ్లు పూర్తయింది. అందుకే ఇది మాకు ఒక ప్రత్యేకమైన ఎడిషన్ కానుంది. ఆ చరిత్ర ఈ వరల్డ్?కప్?నకు మాకు ప్రేరణ ఇస్తుంది. ఒత్తిడిలో చురుకైన నిర్ణయాలు తీసుకోవడం, మంచి ఔట్?పుట్ ఇవ్వడంపైనే మేం దృష్టి పెట్టాము. మా ప్లేయర్లకు ఆట పట్ల నిబద్ధత ఉంది. వారు తమమత అత్యుత్తమ ప్రదర్శననిస్తూ, జట్టులో ఒకరినొకరు ప్రోత్సహించుకుంటున్నారు. పోటీ ఎంత కఠినంగా ఉంటుందో మాకు తెలుసు. కానీ మా ఆటపై మాకు నమ్మకం ఉంది. మా స్ట్రాటజీ సింపుల్. ఆటపైనే పూర్తి దృష్టి పెట్టడం, పూర్తి స్థాయిలో నిమగ్నమవుతూ టైటిల్ సాధించడమే మా టార్గెట్' అని కోచ్ అన్నారు. పురుషుల హాకీ వరల్డ్?కప్ 1971లో ప్రారంభం కాగా ఆ ఎడిషన్? (తొలి)లో భారత్ మూడో స్థానంతో సరిపెట్టుకుంది. రెండో ఎడిషన్??లో రన్నరప్?గా నిలిచింది. అయితే మూడో ఎడిషన్? (1975లో) ఫైనల్?లో పాకిస్థాన్?ను ఓడించిన టీమ్ఇండియా టైటిల్? ముద్దాడింది. అర్జిత్ పాల్ సింగ్ కెప్టెన్సీలో టీమ్ఇండియా 2-1 తేడాతో పాక్?ను ఓడించింది. ఇక ఆ తర్వాత భారత్ మళ్లీ ఈ టోర్నీలో టైటిల్ అందుకోలేదు. గత ఎడిషన్ (2023) భారత్ తొమ్మిదో స్థానానికి పరిమితమైంది. ఈసారి బలమైన జట్టుతో భారత్ బరిలోకి దిగుతోంది. 50ఏళ్ల నాటి మ్యాజిక్?ను రిపీట్ చేసి రెండోసారి ఈ టైటిల్?ను సాధించడమే లక్ష్యంగా హర్మన్?ప్రీత్ సేన వరల్డ్?కప్?లో ఆడనుంది.జట్టు ప్రకటన సందర్భంగా కెప్టెన్ హర్మన్?ప్రీత్ సింగ్ కీలక వ్యాఖ్యలు చేశాడు. ఈసారి పక్కా 'కప్పును ఇంటికి తీసుకొస్తాం' అని ధీమాగా చెప్పాడు. 'వరల్డ్?కప్?ను మరోసారి పక్కా మన ఇంటికి (భారత్?కు) తీసుకొస్తాం. దేశాన్ని గర్వపడేలా చేసేందుకు మాకు ఇదొక మంచి అవకశం' అని హర్మన్?ప్రీత్ అన్నాడు.

# మూడు రోజులుగా ఏమీ తినలే..

**ఈ మెడల్‌ను నా కుటుంబానికి అంకితమిస్తున్నా..!**

కామన్వెల్త్ క్రీడల్లో వరసగా మూడోసారి స్వర్ణంతో చరిత్ర సృష్టించిన మీరాబాయి చాను యావత్ దేశాన్ని సంబురాల్లో ముంచెత్తింది. 48 కిలోల విభాగంలో సత్తా చాటిన మీరాబాయి.. గ్లాస్గోలో భారత్‌కు తొలి స్వర్ణాన్ని అందించింది. పోడియం మీద పతకం అందుకుంటున్న సమయంలో జాతీయ గీతం వింటున్నప్పుడు కలిగే అనుభూతికి మరోది సాటిరాదంటోంది వెయిట్‌లిఫ్టర్. హ్యాట్రిక్ గోల్డ్‌మెడల్స్‌తో తనకు తానే సాటి అని నిరూపించుకున్న మీరాబాయి ఈసారి గెలిచిన పతకాన్ని కుటుంబానికి అంకితమిచ్చింది. గ్లాస్గోలో జరుగుతున్న కామన్వెల్త్ క్రీడల్లో దేశానికి తొలి గోల్డ్‌మెడల్ అందించింది మీరాబాయి చాను. 48 కిలోల విభాగంలో ప్రత్యర్థులను తోసిరాజని అగ్రస్థానం నిలబెట్టుకున్న చాను.. బరువును అదుపులో ఉంచుకునేందుకు కడుపు మాడ్చుకుందట. ఈ విషయాన్ని గోల్డ్ ఖరారయ్యాక వెల్లడించిందామె. 'మూడు రోజులుగా ఏమీ తినలేదు. ఎందుకంటే నా బరువును అదుపు లో ఉంచుకోవడం చాలా కష్టం. అందుకే అలా ఖాళీ కడుపుతోనే ఉన్నా. ఈ స్వర్ణాన్ని నా కుటుంబానికి అంకితమిస్తున్నా. వరసగా మూడోసారి కామన్వెల్త్ పసిడి గెలిచినందుకు చాలా సంతోషంగా ఉంది. నేను




ఎంత ఆనందంగా ఉన్నానో మాటల్లో చెప్పలేను. భారత దేశం కోసం, భారత వెయిట్‌లిఫ్టింగ్ సమాఖ్య కోసం గోల్డ్ మెడల్ సాధించినందుకు నాకు చాలా గర్వంగా ఉంది. నాకిది చాలా పెద్ద విషయం' అని చాను భావోద్వేగంతో చెప్పింది.

**తొలి ప్రయత్నంలో విఫలమైనా....**

కామన్‌వెల్త్ క్రీడల్లో వెయిట్‌లిఫ్టర్ మీరాబాయి చాను తన ఆధిపత్యాన్ని కొనసాగించింది. 2018, 2022లో పసిడి పతకం కొల్లగొట్టిన మీరాబాయి గ్లాస్గోలోనూ పట్టువదల్లేదు. ఈ ఎడిషన్‌లోనూ దేశానికి తొలి స్వర్ణం అందించింది. 82 కిలోలతో కామన్వెల్త్‌లో రికార్డు నెలకొల్పిన మీరాబాయి..క్లీన్ అండ్ జెర్క్ విభాగంలో తొలి ప్రయత్నంలో విఫలమైంది. రెండోసారి తడబడకుండా 82 కిలోలు, మూడో ప్రయత్నంలో 85 కిలోలు ఎత్తి సరికొత్త రికార్డు సాధించింది.
అనంతరం 105 కిలోలను సైతం అవలీలగా ఎత్తిన మీరాబాయి పసిడి పతకంతో మువ్వన్నెల జెండాను రెపరెపలాడించింది. తద్వారా భారత్ పతకాల సంఖ్య మూడుకు చేరింది. మీరా కంటే ముందు వెయిట్‌లిఫ్టింగ్‌లోనే చనంబమ్ రిషికాంత సింగ్ రజతంతో మెరిశాడు. పురుషుల 60 కిలోల విభాగంలో సత్తా చాటిన అతడు రెండోస్థానంతో సరిపెట్టుకున్నాడు.